ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 12 అక్టోబరు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 24.0



నిట్ విద్యార్థులు తమ ఆటపాటలతో ఆహూతులను కట్టి పడేశారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్రియా-2025 వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. -7లో



గోవిందా.. గోవిందా నామస్మరణలతో వాడపల్లి మారుమోగింది. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు భక్తులు పోటెత్తారు. ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, శ్రీవారికి మహా పుష్పయాగం, సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. సరస్వతి అలంకరణలో శ్రీవారు హంస వాహనంపై విహరించారు. -6లో



శనివారపుపేటలో గోదావరి గ్రామీణ బ్యాంక్

నిలిచిన గ్రామీణ బ్యాంకు సేవలు

- నాలుగు బ్యాంకుల విలీనమే కారణం
- రేపు పునరుద్ధరణ

ఏలూరు రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలు నిలిచిపోయాయి. ఈనెల 13వ తేదీ ఉదయం 10గంటల వరకు ఈ సేవలు ఉండవు. కేంద్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నాలుగో విడత బ్యాంకుల విలీనంపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో నాలుగు బ్యాంకులు ఒకే బ్యాంకు కింద విలీనం చేసింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లు ఉన్నాయి. ఇవన్నీ ఒకే సంస్థ కింద అంటే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారాయి. ఈ మేరకు సాంకేతిక సమస్యలను కొలిక్కి తెచ్చేందుకు ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని ఈ నాలుగు బ్యాంకుల సేవలను నిలిపివేశారు. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 58 శాఖలతో నడుస్తోంది. గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, ఏటీఎం సేవలు, బ్యాంకు మిత్ర సేవలు సైతం నిలిచిపోయాయి. ఈనెల 11 రెండో శనివారం కలిసి వచ్చింది. 12 ఆదివారం సెలవు దినం అందుకే 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామీణ వికాస్ బ్యాంకు అన్న పేరు వినిపించదు. ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగానే కనిపిస్తుంది. అయితే చాలా మంది సేవలు నిలిపివేశారని తెలియక ఇబ్బంది పడ్డారు. ఏటీఎం, కార్డులు పనిచేయకపోవడంతో అయోమయానికి గురయ్యారు. ఖాతాదారులు సహకరించాలని బ్యాంకు మేనేజర్లు కోరుతున్నారు.

ఆర్టీసీకి దసరా జోష్

- 284 బస్సు సర్వీసుల నిర్వహణ
- 15 రోజులకు రూ.67.20 లక్షల ఆదాయం



(ఏలూరు-ఆంధ్రజ్యోతి) ఆర్టీసీకి దసరా ప్రయాణాలు జోష్ నింపింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాలతో ఆదాయం అంతంత మాత్రంగా ఉన్న దశలో దసరా ఉత్సవాల రోజుల్లో రూ.67 లక్షల 20 వేల 800 ఆదాయం సమకూరింది. దసరా ప్రయాణాల్లో విజయవాడ, ద్వారకా తిరుమల, వాడపల్లిలకు పెద్ద ఎత్తున ప్రయాణికులు రాకపోకలు సాగించారు. దసరా సెలవులు ఇచ్చిన గతనెల 22 తేదీ నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు ఈ ఆదాయం వివిధ బస్సు రూట్ల ద్వారా సమకూరింది. గతనెల 29 నుంచి ఏలూరు, నూజివీడు, జంగారెడ్డి గూడెం రూట్లలో అదనపు బస్సులను నడిపారు. ఈ నెల 4,5,6,7వ తేదీల్లో బస్సు సర్వీసుల సంఖ్యను రద్దీ ఆధారంగా పెంచడంతో ఆదాయం బాగానే సమకూరిందని అధికారులు తెలిపారు. దసరా సీజన్‌లో 159 బస్సులు నడపగా, అదనంగా 125 బస్సులను విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్ రూట్లలో ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను నడిపారు. గత దసరా సీజన్‌కు 67 శాతం ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియా ఉండగా, ఈసారి 79 శాతానికి పెరి గింది. మామూలు రోజుల్లో 90 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉండేది. ఆర్టీసీకి దసరా పండుగ కొంతమేర ఆదాయం సమకూర్చిందని ఏలూరు డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ

ఏలూరు రూరల్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయుల సమస్యలపై అవగాహన సదస్సును ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం, ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉన్న రాష్ట్ర ప్రధాన ఉపాధ్యాయుల సంఘ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సాధనకు చేస్తున్న కృషిని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సమస్యలను వివరించి అవగాహన కల్పించారు. జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి జె.రవీంద్ర, గౌరవ అధ్యక్షులు జి.ప్రకాశ్, డీసీఈబీ సెక్రటరీ ఎ.సర్వేశ్వరరావు, జిల్లా వ్యాప్తంగా 80 మంది మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఫిర్యాదుల నమోదుకు హెల్ప్‌డెస్క్

ఏలూరు,అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 ప్రయోజనాలు అందరికీ అందాల్సిందేనని,ఈ విషయంలో సహకరించని వర్తకులపై ప్రజల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జీఎస్టీ ప్రయోజనాలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి, సందేహాలను నివృత్తి చేయడానికి జిల్లాలో 87126 31283 ఫోన్ నెంబర్‌తో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. అంతేకాక రాష్ట్రస్థాయిలో జీఎస్టీ ఫిర్యాదుల నమోదుపై 8712631279 నెంబర్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

నేటి నుంచి పాపికొండల విహారయాత్ర పునఃప్రారంభం

■ లోపలి పేజీలో..

డిగ్రీ..డీలా

డిగ్రీ మంచి కళాశాలలో చేరాలంటే ముందుగా వెళ్లాలి. ఇంటర్‌లో మార్కుల పర్సంటేజ్ బాగుండాలి. ఈ రెండు కాకుంటే ప్రజా ప్రతినిధులు, ప్రముఖులతో రికమండేషన్ చేయించాలి.

- ఇది ఇరవై ఏళ్లనాటి మాట

కాని, నేడు పరిస్థితి మారింది. డిగ్రీ వైపు మొగ్గు చూపే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. ఆ రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఏలూరు, భీమవరం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లోని డిగ్రీ కాలేజీలు ఓ వెలుగు వెలిగాయి. ఒక్కో కాలేజీలో సుమారు ఐదు వేల వరకు విద్యార్థులు చదువుకునేవారు. ఇప్పుడు ఆ సంఖ్య వందలకు పడిపోయింది. కొన్ని మూతపడేందుకు సిద్ధంగా వున్నాయి. డిగ్రీ అంటే పెదవి విరుపు. ఇంజనీరింగ్‌పై ఆసక్తి.

ఏటా తగ్గుతున్న సీట్ల భర్తీ

- ఉమ్మడి పశ్చిమలో 120 కాలేజీలు.. 75 వేల సీట్లు.. భర్తీ అయ్యింది 35 శాతమే
- గత ఏడాది కంటే పది శాతం తక్కువ
- రెండో విడత కౌన్సెలింగ్‌పైనే యాజమాన్యాల ఆసక్తి





(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి):

ఇంజనీరింగ్ కోర్సుల హవా ముందు డిగ్రీ కోర్సులు డీలా పడ్డాయి. సాఫ్ట్‌వేర్ స్లోగా వున్నప్పటికి 2024 నుంచి ఇంజనీరింగ్ కోర్సుల వేగం మళ్లీ పెరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ ఏడాది 14 ఇంజనీరింగ్ కాలేజీల్లో 12,900 సీట్లు వుంటే 11,400 సీట్లు భర్తీ అయ్యాయి. అంటే 90 శాతానికి పైగా నిండాయి. అదే 120 డిగ్రీ కాలేజీలలో సుమారు 75 వేల సీట్లు వుండగా ఈ ఏడాది తొలి విడత కౌన్సెలింగ్ పూర్తయ్యే సరికి సుమారు 25 వేల సీట్లు భర్తీ జరిగింది. అంటే 35 శాతం మంది మాత్రమే విద్యార్థులు చేరారు. ఇది గత ఏడాదికంటే పది శాతం తక్కువ కావడం గమనార్హం. కళాశాలల యాజమాన్యాలు రెండో విడత కౌన్సెలింగ్‌పైనే అంతా ఆశలు పెట్టుకున్నారు. ఈ సీట్ల కేటాయింపు నేడో, రేపో జరగనుంది. విద్యా సంవత్సరం మొదలై నాలుగు నెలలు కావడంతో విద్యార్థులు వివిధ కోర్సులలో చేరిపోయారు. అందువల్ల ఈ కౌన్సెలింగ్ ఫలితం పెద్దగా ఉండదని నిపుణులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ..

డిగ్రీ అడ్మిషన్లలో గత ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకు వచ్చాక సీట్ల భర్తీ పడిపోయింది. 2019 నుంచి 2024 వరకు పీజీ కోర్సులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిలిపి వేయడం కూడా డిగ్రీ కోర్సులకు డిమాండ్ తగ్గింది. కూటమి ప్రభుత్వం

(మిగతా 8వ పేజీలో)

డిగ్రీతోనే లక్షల్లో ప్యాకేజీలు

- డిగ్రీలో 25 కోర్సులు విద్యార్థులు చేరేందుకు అందుబాటులో ఉన్నాయి. వాటిలో బీఎస్సీ కంప్యూటర్, ఏఐఐ, డేటా సైన్స్ బీసీఏ కోర్సులు ప్రాధాన్యతగా నిలుస్తున్నాయి. ఇవి చేసిన విద్యార్థులు గడిచిన రెండేళ్లలో రూ.13.50 లక్షలు, రూ.10.50 ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారు. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి కంపెనీల్లో డిగ్రీ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపికవుతున్నారు. డిగ్రీ విద్యార్థులైతే నిలకడ ఉంటుందన్న ఉద్దేశంతో కొన్ని కంపెనీలు వీరిని ఎంపిక చేసుకోవడానికి ప్రాధాన్యతనిస్తున్నారు.

డిగ్రీ కోలుకునేనా..?

- విద్యా రంగంలో కాలానుగుణంగా కొన్ని కోర్సులు వెనుకబడి.. మళ్లీ పుంజుకోవడం చూస్తున్నాం. కొన్ని సంవత్సరాలు ఇంజనీరింగ్ కోర్సులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాయి. చాలా కళాశాలలు మూతపడ్డాయి. ఇప్పుడు మళ్లీ పూర్వ వైభవం సంతరించుకున్నాయి. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన బీఈడీ కొన్నేళ్లుగా ఇందులో చేరేవారు లేక కొన్ని కళాశాలలు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం రావడం, డీఎస్సీ నోటిఫికేషన్ వేయడంతో మళ్లీ బీఈడీపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది ఉమ్మడి జిల్లాలోని 12 బీఈడీ కళాశాలల్లో 80 శాతం సీట్లు పైగా పూర్తయ్యాయి. ఇటీవల కాలంలో బీఏ, బీకాం, బీఎస్సీ చదువుకున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ఈ కారణంగా రాబోయే రోజుల్లో మళ్లీ మంచి రోజులు వస్తాయని కళాశాలల యాజమాన్యాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

• డిగ్రీతోనే అవకాశాలు పుష్కలం



ఇంజనీరింగ్‌కన్నా డిగ్రీతోనే చాలా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో డిగ్రీ విద్యార్థులు భారీ ప్యాకేజ్‌లతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ప్రభుత్వపరంగా 250 శాఖలకు ఇచ్చే నోటిఫికేషన్లకు ప్రధాన అర్హత డిగ్రీనే. మరోవైపు ఇంజనీరింగ్‌లో ఇంటర్ ఫెయిలైన వారు, అత్తెసరు మార్కులతో పాసైన వారు ఇంజనీరింగ్ వైపు వెళుతున్నారు. కొందరు మధ్యలోనే మానేస్తున్నారు. కేవలం సగం మంది విద్యార్థులే ఇంజనీరింగ్‌లో ఉన్నతంగా ఎదుగుతున్నారు. అందువల్ల డిగ్రీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

- గోపిశెట్టి రామకృష్ణ, ప్రగతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, తణుకు

• పెరిగిన ఉద్యోగావకాశాలు



మా కళాశాల నుంచి డిగ్రీ విద్యార్థుల్లో 85 శాతం మంది ఉద్యోగ అవకాశాలు దక్కించుకున్నారు. గతంలో మాదిరి కాకుండా కళాశాలలో క్యాంపస్ ఉద్యోగాలకు సంబంధించిన ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. దీనివల్ల డిగ్రీ విద్యార్థులకు మంచి కంపెనీల్లో అవకాశాలు వస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతోపాటు బయో కెమిస్ట్రీ, మైక్రో బయోలజీ, కోర్సుల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటున్నాయి.

- సకుమళ్ళ సత్యనారాయణ, డాక్టర్ చీడే సత్యనారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

• డిగ్రీతోనే అవకాశాలు పుష్కలం



డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాలు సాధించి వారు రెండేళ్లలోనే అవకాశాలు మరింత మెరుగవుతున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులు సాధించినట్లుగానే డిగ్రీలో ప్రతిభ కనబరిచిన వారికి మంచి కంపెనీలతో పాటు మంచి ప్యాకేజీ కూడా అందుకుంటున్నారు. అయితే డిగ్రీ కౌన్సెలింగ్ ఆలస్యమవడం, ఇంజనీరింగ్‌కు ముందు కౌన్సెలింగ్ జరగడం వల్ల సీట్ల భర్తీ కొంత వెనుకబాటు నెలకొంది. సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కోర్సులు కూడా డిగ్రీలో అందుబాటులో ఉండటంతో చదువుకునే వారికి లాభదాయం.

- ఐ.రామచంద్రమూర్తి, కేజీఆర్‌ఎల్ కళాశాల ప్రిన్సిపాల్



రాచపట్నంలో కాల్వను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి

జిల్లాలో విస్తారంగా వర్షాలు

ఏలూరుసిటీ/కైకలూరు/మండవల్లి,అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కలిదిండి మండలంలో 50.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 6.7 మి.మీ నమోదైంది. పెదవేగి 42.8, ముదినేపల్లి 36.6, మండవల్లి 32.8, ముసునూరు 6.4, కైకలూరు 3.6, పెదపాడు 3.4, చాట్రాయి 2.8, ఏలూరు అర్బన్ 2.6, ఉంగుటూరు 2.6, నూజి వీడు 1.2, భీమడోలు 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కైకలూరు మండలంలో కుండ పోతగా వర్షం కురిసింది. రాచపట్నం, వరహా పట్నం, తదితర గ్రామాల్లో డ్రెయినేజీలు పొంగడంతో రహదారులు ముంపునకు గురయ్యాయి. కైకలూరు-కలిదిండి ఆర్‌అండ్‌బీ రహదారిలో రాచపట్నంలో డ్రెయినేజీ పొంగడంతో కాల్వను తలపించింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మండవల్లిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 165వ జాతీయ రహదారి, కైకలూరు సందు, ఎస్సీ, బీసీ కాలనీలు జలమయమయ్యాయి. మండవల్లి సెంటర్‌లో జాతీయ రహదారిపై డ్రెయినేజీ కెనాల్స్ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో రహదారిపై అడుగు మేర నీరు నిలిచింది.



మండవల్లిలో జలమయమైన జాతీయ రహదారి

పల్లె మారుతోంది

కూటమి సర్కార్ వచ్చిన తర్వాత పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణల పర్వం మొదలైంది. పంచాయతీలను గ్రేడ్‌ల వారీగా జనాభా ప్రాతిపదికన, ఆదాయం పరిగణలోకి తీసుకుని వర్గీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు గ్రేడ్ 1 నుంచి 5 వరకు ఐదు రకాల పంచాయతీలు ఉన్నాయి. ఇకపై నాలుగు గ్రేడ్‌లుగా వర్గీకరించనున్నారు. గిరిజన గ్రామ పంచాయతీలను, నాన్-ట్రైబల్ పంచాయతీలను విభజించడానికి ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించింది.

ప్రక్షాళన దిశగా గ్రామ పంచాయతీలు

- ఐదు గ్రేడ్‌ల నుంచి నాలుగుకు కుదింపు
- జనాభా, ఆదాయం ప్రాతిపదికన విభజన
- పట్టణ తరహా సేవలందించేందుకు స్పెషల్ గ్రేడ్
- మిగిలినవి గ్రేడ్ 1, 2, 3 పంచాయతీలు
- ప్రజలకు మరింత మెరుగైన సేవలు



ఏలూరుసిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పునర్విభజనతో పాలన సమర్థవంతంగా నిర్వహించవచ్చని, ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యదర్శి ఉండాలని, ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడానికి ఈ పునర్విభజన ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రీ కేటగిరైజేషన్‌కు సంబంధించి మే 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 547 పంచాయతీలుండగా వీటిలో చొప్పరామన్న గూడెం పంచాయతీకి ఎన్నికలు నిర్వహించలేదు. మిగిలిన 546 పంచాయతీ విభజన చేసి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు జిల్లా పంచాయతీ శాఖ ప్రతిపాదనలు పంపింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రీ కేటగిరి రైజేషన్‌పై క్యాబినెట్‌లో ఆమోదం తెలిపింది.

పునర్విభజన వల్ల ప్రయోజనాలు

పంచాయతీల పునర్విభజన వల్ల సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందుబాటులో తీసుకు రావడానికి అవకాశం ఏర్పడుతుంది. పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపడతాయని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఏర్పడు తుంది. జనాభా ప్రాతిపదికన పునర్విభజనతో ఏఏ పంచాయతీకి ఎంత సిబ్బంది ఉండాలో నిర్ణయిస్తారు. దీనిని బట్టే ప్రతి పంచాయతీకి కార్యదర్శితో పాటు ఇతర సిబ్బంది నియామకాలు ఉంటాయి. ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శులు సరిపడనంత లేక ఇన్‌చార్జిల పాలనలోనే చాలా పంచాయతీలు కొనసాగడంతో పరిపాలనలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విషయాలన్నీ పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల బలోపేతానికి ఈ వర్గీకరణను చేపట్టింది.

రూర్బన్ పంచాయతీలుగా గుర్తింపు

ఇదిలా ఉండగా అధిక జనాబా కలిగిన పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తించి , వాటికి అధికారులుగా గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించి నియమిస్తారని చెబుతున్నారు. ఇక నుంచి పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు (పీడీవో)గా పిలవనున్నారు. రూర్బన్ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో క్యాడర్ అధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూనియర్ అసిస్టెంట్/ జూనియర్ (మిగతా 8వ పేజీలో)

ప్రస్తుతం ఇలా..

- జిల్లాలో ప్రస్తుతం 546 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో గ్రేడ్ 1 - 87, గ్రేడ్ 2 - 89, గ్రేడ్ 3 - 101, గ్రేడ్ 4 - 99, గ్రేడ్ 5 - 170గా కొనసాగుతున్నాయి.

విభజన తర్వాత ఇలా..

- స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు 10 వేలకు పైగా జనాభా, రూ.కోటికి పైగా ఆదాయం ఉండాలి. ఇవి 15 పంచాయతీలు ఉన్నాయి.
- గ్రేడ్-1 పంచాయతీకి మూడు వేల నుంచి 10 వేల వరకు జనాభా, రూ.50 లక్షల నుంచి కోటి వరకు ఆదాయం కలిగి ఉండాలి. ఇవి 99 పంచాయతీలు ఉన్నాయి.
- గ్రేడ్ - 2 పంచాయతీకి రెండు నుంచి మూడు వేల వరకు జనాభా వుండాలి. ఆదాయంతో నిమిత్తం లేదు. ఇవి 211 పంచాయతీలు ఉన్నాయి.
- గ్రేడ్- 3 పంచాయతీకి రెండు వేలలోపు జనాభా వుండాలి. ఇక్కడ కూడా ఆదాయంతో నిమిత్తం లేదు. ఇవి 221 పంచాయతీలుగా విభజించనున్నారు.
- ట్రైబుల్ పంచాయతీల్లో స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు 5వేలలోపు జనాభా, గ్రేడ్- 1 పంచాయతీకి 3వేలకు పైగా 5 వేలు లోపు జనాభా, గ్రేడ్- 2 పంచాయతీకి 1500కు పైగా 3వేలకు లోపు జనాభా, గ్రేడ్- 3 పంచాయతీకి 1500కు పైగా జనాభా ఉండాలి.



శ్రీవారి అనివేటి మండప ప్రాంతంలో యాత్రికుల రద్దీ

శ్రీవారి క్షేత్రం.. భక్త జనసంద్రం

» 20 వేల మంది పైబడి భక్తులు దర్శించినట్టు అంచనా

» ఒక్కరోజే శ్రీవారి ఆదాయం రూ.32 లక్షలు

ద్వారకాతిరుమల, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారి ప్రసాదాలు, దర్శనాలు, ఆర్జిత సేవల టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజే రూ.32 లక్షలు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. రెండో శనివారం కావడంతోపాటు శ్రీవారికి ఇష్టమైన రోజు అవడం వల్ల దాదాపు 20 వేల మందికి పైబడి యాత్రికులు క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీవారి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ఐదు కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయింది. శ్రీవారి ఉచిత దర్శనానికి మూడు గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం ఐదు గంటల నుంచి యాత్రికుల రద్దీ కాస్త తగ్గింది. దర్శనానంతరం భక్తులు శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నేటి నుంచి పాపికొండల విహారయాత్ర పునఃప్రారంభం

పోలవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం తగ్గడంతో ఆదివారం నుంచి పాపికొండల విహారయాత్ర బోట్లను గండి పోచమ్మ ఆలయం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గోదావరి పోటెత్తిన సమయంలో ప్రతీ ఏటా పాపికొండల టూర్‌ను నిలిపి వేస్తుంటారు. నీటిమట్టం తగ్గి విహారయాత్రకు అనుకూలంగా ఉండడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. పర్యాటకులకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. పాపికొండల సుందర దృశ్యాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు విహారయాత్రకు రావాలని బోటు యజమానులు కోరుతున్నారు.



కార్తీక మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

22 నుంచి మద్దిలో కార్తీక మాస మహోత్సవాలు

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాస మహోత్సవాలు ఈనెల 22 నుంచి నవంబరు 20వ తేదీ వరకు జరుగుతాయని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. శనివారం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని టీడీపీ నాయకులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక మాస మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈవో ఆర్వీ చందన, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రాజాన పండు తదితరులు పాల్గొన్నారు.

సేవల తపాలా



తాడేపల్లిగూడెం హెడ్ పోస్టాఫీస్

గతంతో పోలిస్తే దేశంలో పోస్టల్ సేవలు బాగా విస్తరించాయి. తొలిదశలో కేవలం ఉత్తరాల బట్వాడా, మనీ ఆర్డర్‌లకే పరిమితమైనప్పటికీ ఇప్పుడు పోస్టల్ సేవలు మరింత విస్తృతమయ్యాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్యాంక్‌లకు దీటుగా ఆర్థిక సేవలు అందిస్తున్నాయి. ఏటీఎం కౌంటర్ల ద్వారా నగదును విత్ డ్రా చేసుకోవడంతో పాటు ఇతర బ్యాంక్‌ల ఏటీఎం కార్డులు తెచ్చి ఈ కౌంటర్ ద్వారా నగదు పొందే అవకాశాన్ని కల్పించారు. డాక్ నిర్యాత్ కేంద్రాన్ని ప్రారంభించి విదేశాల్లో ఉండే వారికి మెరుగైన సేవలు అందించే దిశగా పోస్టల్ విస్తరించింది. విశ్వకర్మ కిట్స్ పంపిణీలో కూడా పోస్టల్ శాఖ సేవలు అందిస్తుంది. పోస్టల్ శాఖ అందించే కొన్ని రకాల సేవలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి

» తపాలా బీమాతో గ్రామీణులకు ధీమా » విస్తరించిన పోస్టల్ శాఖ సేవలు

» గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్యాంకులకు దీటుగా ఆర్థిక సేవలు

ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) :

ఐపీపీబీ ద్వారా ఆధార్ లింక్ ఖాతాతో డోర్‌స్టెప్ బ్యాంకింగ్, బిల్ పేమెంట్స్, రీచార్జ్, బీమా సేవలు అనేక ఇతర సేవలు అందుబాటులోకి వచ్చాయి. పోస్టాఫీస్ ద్వారా పది రకాల సేవింగ్ పథకాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. సీనియర్ సిటిజన్ సేవింగ్ పథకం(ఎస్‌సీఎస్‌ఎస్), సుకన్య సమృద్ధి యోజన(ఎస్‌ఎస్‌ఏ), నేషనల్ సేవింగ్ స్కీమ్(ఎన్‌ఎస్‌సీ), కిసాన్ వికాసపత్ర (కేవీపీ), ఐదే సంవత్సరాల టైమ్ డిపాజిట్ (5టీడీ), మంత్లీ ఇన్‌కం స్కీమ్(ఎంఐసీ), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), మూడేళ్ల టైమ్ డిపోజిట్ (3టీడీ), రెండేళ్ల టైమ్ డిపాజిట్ (2టీడీ), రికరింగ్ డిపాజిట్(ఆర్‌డి), సేవింగ్ అకౌంట్(ఎస్‌బీ) వంటి పథకాలు ప్రజల్లో ప్రాచుర్యం పొందాయి.

గ్రామీణ తపాలా బీమా పథకం

గ్రామీణ ప్రాంతాల్లో బీమా రంగాన్ని తపాలా శాఖ విస్తరించింది. దీనిలో భాగంగా వారికి అవసరాలకు అనుగుణంగా పాలసీలను రూపొందించింది. ఎంతో మంది గ్రామీణులకు చేరువయ్యేలా పథకాలను రూపొందించింది. వాటిలో కొన్ని ప్రజాదరణ పొందిన బీమా పథకాలు...

గ్రామ సురక్ష (హోల్‌లైఫ్ అస్యూరెన్స్) :

సురేష్ అనే వ్యవసాయ కూలీ 30 ఏళ్ల వయస్సులో రూ.5 లక్షల బీమా పాలసీ తీసకున్నాడు. అతడికి 55 ఏళ్ల వయస్సు వచ్చేవరకు ప్రీమియం చెల్లించాడు. అక్కడ నుంచి ప్రీమియం కట్టనవసరం లేదు. కాని 80 సంవత్సరాల వరకు బీమా ఉంటుంది. 80 ఏళ్ల తరువాత బీమా మొత్తం, బోనస్ కలిపి సుమారుగా రూ.21.50లక్షలు మొత్తాన్ని అందజేస్తారు. పాలసీకడుతూ ఉండగా మరణిస్తే బీమా మొత్తం అప్పటికి కలిసిన బోనస్ కలిపి మొత్తం ఇస్తారు. దీనికి కనీస బీమా రూ.10వేలు, గరిష్ట బీమా రూ.10లక్షలు, వయస్సు 19 ఏళ్ల నుంచి 55 సంవత్సరాల మధ్యలో ఉండాలి. మూడేళ్ల తరువాత రుణ సదుపాయం కల్పిస్తారు.

గ్రామ సంతోష్ (ఎండోమెంట్ అస్యూరెన్స్) :

ఇది పూర్తిగా ఎండోమెంట్ ప్లాన్, మనం ఎంతకాలం చెల్లించడానికి నిర్ణయించుకుంటామో అంతకాలం వరకు ఇన్సూరెన్స్ ఉంటుంది. ప్రీమియం చెల్లింపు అయిపోయిన తరువాత మెచ్యూరిటీ అమౌంట్ కింద బీమా మొత్తం, బోనస్ కలిపి ఇస్తారు. ప్రీమియం చెల్లించే సమయంలో ప్రమాదవశాత్తు మరణం జరిగితే బీమా మొత్తం, అప్పటికి జమైన బోనస్ కలిపి నామినీకి అందజేస్తారు. వయస్సు 19 ఏళ్ల నుంచి 55 సంత్సరాల మధ్య వారు ఎవ్వరైనా బీమా తీసుకోవచ్చు. మూడేళ్ల తరువాత రుణ సదుపాయం, సరెండెడ్ సదుపాయం ఉంది.

గ్రామ సుమంగళ్ (యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అస్యూరెన్స్) :

ఇది పూర్తిగా మనీబ్యాక్ పాలసీ. అంటే శివ అనే వ్యక్తి 24 ఏళ్ల వయస్సులో 20 ఏళ్ల పాటు ప్రీమియం చెల్లించే విధంగా రూ.10 లక్షల గ్రామ సుమంగళ్ పాలసీ తీసుకున్నాడు. పాలసీ కడుతుండగానే నాలుగేళ్లు దాటిన తరువాత శివకు ఎస్‌బీ (సర్వైవల్ బెనిఫిట్)గా బీమా మొత్తంలో 20శాతం ఇస్తారు. అంటే రూ.2,00,000 ఇస్తారు. 8వ సంవత్సరంలో మరో రూ.2,00,000, 12వ సంవత్సరంలో రూ.2,00,000, 16వ సంవత్సరంలో మరో రూ.2,00,000, 20వ సంవత్సరంలో రూ.10 లక్షల బీమాలలో మిగిలిన రూ. 2,00,000, 20 సంవత్సరాల బోనస్ కలిపి పాలసీ దారునికి అందజేస్తారు. ప్రీమియం కడుతున్న సమయంలో సహజ మరణం సంభవిస్తే బీమా మొత్తం రూ.10లక్షలు అప్పటికి జమైన బోనస్ కలిపి నామినీకి ఇస్తారు. ప్రమాద మరణం జరిగితే రూ.20లక్షల బీమా మొత్తంతో పాటు అప్పటివరకు జమైన బోనస్ కలిపి నామినీకి అందజేస్తారు. ఈ విధంగా కాకుండా నాలుగు సర్వైవల్ బెనిఫిట్(ఎస్‌బీ)లు తీసుకున్న తరువాత సహజ మరణం జరిగితే రూ.10లక్షల బీమా మొత్తం, బోనస్ కూడా నామినికి ఇస్తారు. ఇదే ప్రమాద మరణం జరిగితే రూ.20లక్షల బీమా మొత్తం, బోనస్ కలిపి నామినీకి ఇస్తారు.

వ్యక్తిగత ప్రమాద బీమా పథకం

పోస్టల్ శాఖ ప్రమాద బీమాను ప్రవేశపెట్టింది. స్టార్ హెల్త్ ఇన్సురెన్స్‌తో దీన్ని అనుసంధానం చేసుకుంది. సంవత్సరానికి రూ.799 కడితే రూ.15 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని, అదే ఏడాదికి రూ.559 కడితే 10 లక్షలకు ప్రమాద బీమా పొందవచ్చని పోస్టల్ అధికారులు చెబుతున్నారు. 18 నుంచి 65 ఏళ్ల వయస్సు గలవారు ఈ పాలసీని పొందేందుకు అర్హులుగా నిర్ణయించారు. శంకర్ ప్రసాద్ అనే వ్యక్తి రూ.15లక్షల ప్రమాద బీమా తీసుకుంటే అతడు ప్రమాదంలో మరణం సంభవిస్తే రూ.15 లక్షల పాలసీకి రూ.15లక్షలు బీమా వర్తిస్తుంది. శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ.15 లక్షల బీమా మొత్తం వస్తుంది. శాశ్వత పాక్షిక వైకల్యం జరగితే రూ.15లక్షలు పిల్లల విద్యా ప్రయోజనాలకు రూ.50వేలు, గృహ స్వస్థతకు రూ.5వేలు, ప్రమాదవశాత్తు వైద్యఖర్చులకు రూ.లక్ష, హాస్పటిల్ నగదు ప్రయోజనం రోజుకు రూ.1000, దిగుమతి చేసుకున్న మెడిసిన్స్ రవాణా ఖర్చులు రూ.14వేలు, బీమా చేయబడిన వ్యక్తికి బాహ్య మద్దతుగా రూ.14వేలు ఇస్తారు. అంబులెన్స్‌లో పార్థివ దేహాన్ని తరలించడానికి రూ. 11వేలు, బంధువు ప్రయాణ ఖర్చుగా రూ.11వేలు, రక్తం కొనుగోలుకు రూ.11 వేలు, అంత్యక్రియల ఖర్చుగా రూ.9వేలు అందజేస్తారు.

గ్రామ ప్రియ (పదేళ్ల తపాలా బీమా)

ఇది ప్రీమియం చెల్లించేది పదేళ్ల మాత్రమే. అంటే 25 ఏళ్లు ఉన్న మనోజ్ రూ.5లక్షల బీమా తీసుకుంటే అతడు నెలకు రూ.4,825 వంతున పదేళ్ల పాటు చెల్లిస్తాడు. 35 ఏళ్లకు మెచ్యూరిటీగా రూ.7.25లక్షల మొత్తం తీసుకుంటాడు. పాలసీ కడుతుండగా సహజ మరణం సంభవిస్తే బీమా మొత్తం రూ.5 లక్షలు, బోనస్ కలిపి నామినీకి ఇస్తారు. అదే ప్రమాద మరణం జరిగితే రూ.10లక్షల బీమా మొత్తం, బోనస్ కలిపి నామినీకి ఇస్తారు.

ఆర్థిక భద్రతకు భరోసా..



పోస్టల్ శాఖ సామాజిక సేవతో పాటు జీవిత బీమా, ప్రమాద బీమా మనిషికి కావాల్సిన ఆర్థిక భద్రతకు భరోసా కల్పిస్తుంది. దీనిలో భాగంగా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు అందిస్తూ ముందుకు వెళతోంది. ఆధార్ కేంద్రాలను పాఠశాలల్లో నిర్వహించి విద్యార్థుల వేలిముద్రలను అప్‌డేట్ చేయడంతో పాటు వివిధ పండుగలకు సంబంధించిన శుభాకాంక్షలను కూడా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో అందజేస్తుంది. పుణ్యక్షేత్రాలైన కాశీ, గయ వంటి క్షేత్రాలకు అస్తికలను నామమాత్రపు ధరతో పంపించే కార్యక్రమాలను చేపట్టింది. ప్రధానంగా గ్రామీణ ప్రజలను ఆకర్షించే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నాం.

- ఎ.సురేష్‌కుమార్, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, తాడేపల్లిగూడెం

అద్వితీయంగా..



విద్యుద్దీపాలంకరణలో ఆలయ ప్రాంగణం

కొలువుతీరిన ఉత్సవమూర్తులు

» రెండో రోజు ఘనంగా బ్రహ్మోత్సవం » ఆకట్టుకున్న ఫల,పుష్ప అలంకరణ

» వాడపల్లికి పోటెత్తిన భక్తజనం » హంస వాహనంపై ఊరేగిన స్వామి

ఆత్రేయపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవిందా న్నామస్మరణలతో వాడపల్లి మారుమ్రోగింది.. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. ఆలయాన్ని ఫలపుష్పాలతో సర్వాంగ, సుందరంగా అలం కరించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో ఫల పుష్పాలతో అలంకరించిన వేదిక వద్దకు స్వా మి వారిని తీసుకువచ్చి సంకల్పం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సప్తకలశారాధన, అభిషేకం, ప్రధాన హోమాలు నిర్వహించా రు. పలు రకాల పుష్పాలతో శ్రీవారికి మహాపుష్పయాగం అత్యంత ఘనంగా చేశారు. అశేష భక్తజనం శ్రీపుష్పోత్సవాన్ని తిలకించి మంత్రముగ్దులయ్యారు. అనంతరం సాయంత్రం ప్రధాన హోమాలు నిర్వహించి సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటకు సరస్వతి అలంకరణలో శ్రీవారు హంస వాహనంపై విహరించి భక్తులకు అభయ హస్తం అందించారు. తిరువీధుల్లో విద్యుద్దీపాలు,మేళతాళ మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణల నడుమ హంస వాహన సేవ కన్నుల పండువగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.శంఖు చక్రనామాలతో ఏర్పాటు చేసిన ఫొటోషూట్ వద్ద భక్తులు సందడి చేశారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం వేలాదిగా భక్తులు వచ్చారు. చైర్మన్, ఈవో దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

ఒక్కరోజు.. రూ.51.88 లక్షలు

వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.51.88 లక్షలు లభించినట్టు ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.



స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ చైర్మన్, కమిషనర్ దంపతులు



ఫల, పుష్పాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం

భక్తులకు 21 వేల మొక్కలు

లక్షతులసీ, ఉసిరి, మారేడు మొక్కల వితరణ య జ్ఞంలో భాగంగా శనివారం పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరానికి చెందిన పెన్మెత్స ఆదినారాయణరాజు- నాగవల్లి దంపతులు 21 వేల తులసి, ఉసిరి, మారేడు మొక్కలను భక్తులకు వితరణ చేశారు.లక్ష మొక్కల పంపిణీలో భాగంగా ఇప్పటి వర కూ 54 వేల మొక్కలు వితరణ చేసినట్టు తెలిపారు. మొక్కల విశిష్టతను భక్తులకు వివరించారు.

పేదరికాన్ని ఓడించి.. సంకల్పంతో సాధించి..

» పల్లెటూరు నుంచి బోర్డర్ వరకు » బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎదిగిన దుర్గా రమ్యశ్రీ

ఆమె లక్ష్యం ముందు పేదరికం పరారయ్యింది. ఆడపిల్లకు చదువెందుకు.. అని హేళన చేసిన వాళ్ల ఎదుటే లక్ష్యాన్ని సాధించి.. పేదరికాన్ని జయించింది. అదే ఆడపిల్ల దేశ సరిహద్దు భద్రతా దళం (బోర్డర్ సెక్యూలోగి ఫోర్సు)కానిస్టేబుల్‌గా ఎంపికై ఔరా అనిపించింది. హేళన చేసిన చోట మంగళహారతులతో దీవెనలతో పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ఆమె దెందులూరు మండలం పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కంతుబోతు దుర్గా రమ్యశ్రీ.

పీఎం మెడల్ సాధనే లక్ష్యం : రమ్యశ్రీ



చాలాకాలం నుంచి నేను పడుతున్న కష్టాలకు ఉద్యోగంతో సాంత్వన దొరికింది. దేశ సరిహద్దుల్లో ఉత్తమంగా రాణించి, దేశమాత రుణం తీర్చుకుంటా. ఇక్కడ మెరుగైన ప్రతిభా పాటవాలు చాటి.. ఎప్పటికైనా ప్రధాన మంత్రి చేతుల మీదుగా మెడల్ సాధించడమే నా ప్రధాన లక్ష్యం.



శిక్షణలో రమ్యశ్రీ

(దెందులూరు-ఆంధ్రజ్యోతి): ఆమెదొక కుగ్రామం.. గంజినీళ్లకు కూడా కష్టమైన కుటుంబంలో తల్లిదండ్రుల కంతుబోతు నాగు, పద్మావతి దంపతుల రెండో కుమార్తె దుర్గారమ్యశ్రీ. కష్టాలను దిగమింగి.. చదువే పరమావధికి ఎన్నో ఆటుపోట్లకు ఎదిరించి సరిహద్దు గస్తీ దళంలో కానిస్టేబుల్‌గా ఎదిగింది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండ్రాజవరం ప్రభుత్వ పాఠశాలలో, టెన్త్ వరకు జడ్పీ హైస్కూల్ (పోతునూరు)లో చదివింది. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు స్థానిక భీమడోలు వేంకటేశ్వర కళాశాల బీకామ్ కంప్యూటర్స్ పూర్తి చేసింది. చదువుతున్న రోజుల్లో తల్లిదండ్రులతో పాటు కూలీనాలీ చేసుకునే తనకు కావాల్సిన



దుర్గా రమ్యశ్రీ పూరిల్లు

మెటీరియల్ సంపాదించుకునేది. అప్పట్లో పీఈటీ రామాంజనేయులు ఇచ్చిన సూచనలతో 2021లో ఎన్‌సీసీలో చేరడంతో పాటు క్రీడాపోటీల్లో ప్రతిభ చాటింది. మల్టీస్టార్ క్రీడాకారిణిగా అథ్లెటిక్స్, కబడ్డీల్లోనూ మండల స్థాయిలో పలు పతకాలను కైవసం చేసుకుంది. ఒకానొక దశలో క్రీడా దుస్తులకు ఇబ్బందైతే.. ఈ పీఈటీ కొంత ఆర్థిక సహకారం అందించడంతో క్రీడల్లోనూ రాణించింది. 2022లో తణుకులో ఒక ప్రైవేట్ బ్యాంకులో క్లర్‌గా పనిచేస్తూ, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యింది. గతంలో పీఈటీ ఇచ్చిన సూచనలతోనే బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సులో కానిస్టేబుల్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంది. కఠోరంగా నిరంతరాయ శ్రమ, కసరత్తులతో శారీరర ధారుడ్య పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఉద్యోగానికి ఎంపికైంది. 2024-25 నార్త్ బెంగాల్‌లో బైకంతపూర్‌లో బీఎస్ఎఫ్‌లో శిక్షణలో రాటుదేలింది.

● పోలీసే లక్ష్యం.. తీరా గస్తీ దళంలో చోటు..

రమ్యశ్రీకి చిన్నప్పటికి పోలీస్ కొలువు చిన్నదైనా చేయాలనే కోరిక ఉండేది.తీరా పేదరికంలోనైనా అన్ని కష్టనష్టాలను ఎదుర్కొని అదే తరహాలో మరింత గౌరవమైన దేశభద్రతా సరిహద్దు వ్యవస్థలో సభ్యురాలిగా ఎంపిక కావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. శిక్షణ పూర్తి చేసుకున్న రమ్యశ్రీకు గ్రామస్థులు, బంధువులు నీరాజనాలు పలికారు. ఈ వారంలోనే కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతల స్వీకరణకు సిద్ధమైంది.

కొడుకును మరిపించింది..

- తల్లిదండ్రుల ఆనందభాష్పాలు

చిన్నప్పటి నుంచి మా కష్టాల్లో పాలుపంచుకుంటూనే బాగా చదివింది. కొడుకు లేని లోటు ఉద్యోగ సాధనతో తీర్చింది. కొడుకులున్నా ఇలా ఎదిగివారే కాదేమో అంటూ తల్లిదండ్రులు నాగు, పద్మావతి ఆంధ్రజ్యోతి ముందు ఆనంద భాష్పాలతో మాట్లాడారు.





ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కేటింగ్ క్రీడలు


ఉత్సాహంగా రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి) : రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ బడేటి వెంకట్రామయ్య, పోటీలను డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీక మానసిక వికాసంతోపాటు విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కానాల రమేష్ మాట్లాడుతూ ఎంపిక పోటీలకు జిల్లావ్యాప్తంగా వందమందికి పైగా హాజరయ్యారని, ఐదేళ్ల నుంచి 17 ఏళ్లలోపు బాలబాలికలకు పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు కాకినాడలో జరిగే 37వ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డి.సురేష్, కోచ్ ఖాసిం, తదితరులు పర్యవేక్షించారు.

వణికిస్తున్న మాయరోగం

» మూగ జీవాల్లో వ్యాప్తి చెందుతున్న చర్మవ్యాధి

» పాడి రైతుల గగ్గోలు



చర్మవ్యాధి సోకిన గోవులు

ఆకివీడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా మూగజీవాల్లో పలు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. గాలికుంటు, జబ్బ, గొంతు వాపు వంటివి వర్షాకాలంలో సోకుతాయి. ఇవేకాకుండా ఈగలు, దోమలు పశువులను ఇబ్బందులు పెడుతుంటాయి. వీటితో పాటు ఆవుల్లో కొత్తవ్యాధి కన్పించి రైతులను కలవరపెరుస్తుంది. దద్దుర్లు, పుండులుగా మారి చర్మ వ్యాధి కలకలం రేపుతుంది.

● నెల రోజుల నుంచి చర్మవ్యాధి బాగా వ్యాపిస్తుండడంతో గోశాల యాజమాన్యం మందులు వాడుతున్నప్పటికీ వ్యాధి అదుపులోకి రాకపోవడంతో పశువులు చనిపోతున్నాయి. నెల రోజులో సుమారు ఐదు గోవులు చనిపోయినట్టు గోశాల యాజమాన్యం చెబుతుంది. ఈ వ్యాధి త్రీవత చెందినప్పుడు పశువులు ముఖ్యంగా మేత తినవు, నీరు తాగక నీరసించి చనిపోతున్నాయి. యాజమాన్యం ముందుగా గుర్తించి వైద్యం అందించినప్పటికీ వ్యాధిని నివారించలేకపోతున్నామని వాపోతున్నారు. వేల రూపాయలతో గోవులను కొనుగోలు చేసి గోశాల నడుపుతున్నామని, పశువర్థక శాఖాధికారులు వైద్య సేవలందిస్తున్నా వ్యాధి అదుపులోకి రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.


● వెటర్నరీ ఏడీ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పశువులలో చర్మవ్యాధి అక్కడక్కడా కనపడుతుందని, పశువులకు పుట్టిన దూడలకు సరైన సమయంలో నట్టల మందు వేయకపోయినా మరణిస్తాయి. వైరస్ నివారణకు వైద్యం చేస్తున్నామన్నారు.

నెలలో ఐదు చనిపోయాయి.



పట్టణ పరిధిలో పలు వీధుల్లో పశువులు పగలు, రాత్రిళ్లు అనే తేడా లేకుండా విచ్చల విడిగా తిరుగుతున్నాయి. చర్మవ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుందో తెలియడం లేదు. నెలలో ఐదు పశువులు చనిపోయాయి. ఈ సమస్యను పశుసంవర్ధక శాఖ దృష్టికి తీసుకెళ్లగా వైద్యం అందించినా నివారణ సాధ్యం కావడంలేదు. ముందుగా వీధుల్లో తిరుగుతున్న పశువులను నియంత్రించకపోతే ఈ వ్యాధి మరింత ఉధృతమవుతుంది. అధికారులు చర్యలు చేపట్టాలి.

- దత్తు, గోశాల యజమాని, ఆకివీడు

ఎకో పెయింటింగ్ ప్రదర్శన.. విద్యార్థిని నృత్యం

ఏపీ నిట్‌లో ముగిసిన టెక్రియా-2025

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్రియా-2025 వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రాంగణంలోని ఆయా శాఖల ఆధ్వర్యంలో చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

ఆకట్టుకున్న 'గైర్ మేజ్ చాలెంజ్'

ఈసీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గైర్‌మేజ్ చాలెంజ్ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ ఆటలో ఓ వ్యక్తి తన చేతికి గైర్ స్కోప్‌ని అమర్చుకుని ఆడాల్సి ఉంటుంది. చేతికి ఉన్న గైర్ స్కోప్‌ను అటు ఇటూ తిప్పడం ద్వారా కారు ముందుకు, వెనక్కి వెళ్తుంది. ఇలా ఎరుదుగా ఉన్న పలు అడ్డంకులను దాటుకుని నిర్ణీత సమయంలో గమ్య స్థానానికి చేరుకోవాలి. ఎవరైతే ముందుగా వెళ్తారో వారిని విజేతలకు ప్రకటిస్తారు.

అలరించిన 'ఎకో పెయింటింగ్'

నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎకో పెయింటింగ్ పోటీలు చూపరులను అలరించాయి. దీనిలో పాల్గొనే వారు రంగులతో లేక ఆకులతో నిర్వాహకులు చెప్పినట్టు బొమ్మలకు పెయింటింగ్ వేసి అందంగా తీర్చి దిద్దాలి. ఎవరైతే అందంగా వేస్తారో వారినే విజేతగా ప్రకటిస్తారు. నిర్వాహకులు ముందుగానే కొన్ని రకాల పూలను వేసి వాటి చేసి రసాన్ని తీస్తారు. వాటిని మాత్రమే బొమ్మలకు రంగులుగా వినియోగించాలి.

ఎట్టకేలకు బకెట్లలో ఇసుక నింపారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కలెక్టరేట్ ఆవరణలో స్టాండ్‌కు ఉన్న బకెట్లలో ఇసుక నింపిన దృశ్యం

ఏలూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో మంటలను అదుపు చేసేందుకు ముందస్తుగా ఫైర్ బకెట్లలో ఇసుకను అధికారులు ఎట్టకేలకు నింపించారు. 'ముందు జాగ్రత్త మూలనబెట్టారు' శీర్షికన ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనంపై అధికారులు స్పందించారు. మెట్ల భాగం వెనుక ఉన్న రెండు ఫైర్ బకెట్లను శుభ్రం చేసి అందులో ఇసుకను నింపారు. అయితే కలెక్టరేట్ ఆవరణలో పాత స్టాండ్‌కు ఉన్న తుప్పుపట్టిన బకెట్‌ను మార్చక పోవడం విశేషం. ఏదైనా అధికారుల్లో కాస్తంత చలనం రావడం గమనార్హం.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పెదవేగి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఇఫ్టూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. పెదవేగిలోని ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఏపీ ఆయిల్‌ఫెడ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూని యన్, హమాలీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈమేరకు ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకర్‌కు కార్మికులు వినతిపత్రం అందించారు. సమావేశంలో బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. ప్రభుత్వరంగ సంస్థ అయినప్పటికీ ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్ ఆ చట్టాన్ని అమలు చేసే విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది సరైనది కాదని, చట్ట వ్యతిరేకమైన ఆలోచనతో కాంట్రాక్టుదారు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టపరిధిలో ఉన్న డబుల్ ఓటీ అమలు చేయాలని, జాతీయ సెలవు దినాలు, పండుగ సెలవులు అమలు చేయాలని, కనీస సౌకర్యాలు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణం కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించాలని. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇఫ్టూ అనుబంధ కార్మికసంఘం నాయకులు మానికొండ కాంతారావు, హరిబాబు, తాతా నాగేశ్వరరావు, నాగరాజు, ధర్మేంద్ర, ఈశ్వరరావు, శంకర్, ప్రసాద్, శ్రీను, అప్పారావు, వినోద్, తాతినాయుడు, చక్రవర్తి, రత్నం, భాష తదితరులు పాల్గొన్నారు.

'ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలి'

చింతలపూడి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 13వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్యామలరాణి కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి ఆవరణలో జయప్రదానికి చిహ్నంగా ముగ్గు వేసి నినాదాలు చేశారు. జిల్లా నాయకురాలు ఎం.వరలక్ష్మీదేవి, పట్టణ నాయకురాలు కురిశెట్టి అనూరాధ, పి.గోపలక్ష్మి, ఆర్.సుజాత పాల్గొన్నారు.

పేర్ని నానిపై బీసీ నాయకుల ఆగ్రహం

కలిదిండి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నానికి బీసీలు అంటే చులకన అని కైకలూరు నియోజకవర్గ బీసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కోరుకొల్లులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పేర్ని నాని మచిలీపట్నంలో పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సీఐ ఏసుబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని సీఐకి ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొచ్చెర్ల మాజీ సర్పంచ్ బుసన బోయిన పేర్రాజు, కొమరాపాలెపు సత్యనారాయణ, బుసనబోయిన అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి బాధ్యతగా పనిచేయాలి : మంత్రి నిమ్మల



పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులంతా భక్తి శ్రద్ధలతో బాధ్యతగా పనిచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత యడ్లబజార్ కూడలి నుంచి మంత్రి, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మంత్రి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మీసాల రామచంద్రరావు (రాము), సభ్యులు బాసిన సత్యనారాయణ, పినిశెట్టి శ్రీనివాస్, పెన్మత్స శ్రీదేవి, నాళం సురేఖ, వందరపు కుమారి, హోతా ప్రవాళ, నీలాపు సింహాచలం, నీలాపు మణి, సన్నిధిరాజు రామకృష్ణమూర్తితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఆలయ నూతన కమిటీ భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అంతర్వేదిలో రథం అగ్నికి ఆహుతైతే.. ఇదెలా జరిగిందని తాము అసెంబ్లీలో ప్రశ్నిస్తే రథం షెడ్డుకు ఉన్న తేనెపట్టుకు ఎవరో మంటపెట్టడంతో రథం కాలిపోయిందని జగన్ ప్రభుత్వం చెప్పిందన్నారు. అలాగే విజయవాడ దుర్గమ్మ ఆలయంలో సింహం బొమ్మలు విరిగిపోతే ఆనాటి వైసీపీ మంత్రి ఏముంది అవి రాతిబొమ్మలే కదా అని చెప్పారని, అంటే ఆనాటి పాలకులకు ప్రజలంటే ఎలాగూ భయం లేదు.. కనీసం దేవుడన్నా భయం లేదని మంత్రి ఎద్దేవా చేశారు. నేడు ఎన్డీఏ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి, భక్తుల మనోభావాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగు నీరందించడమే లక్ష్యం

మంత్రి పార్థసారథి ▸ కాట్రేనిపాడులో గండి పరిశీలన



కాల్వ గండిని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి తదితరులు

ముసునూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు పుష్కలంగా సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కాట్రేనిపాడు వద్ద మైనర్ కాలువకు పడిన గండిని ఎన్నెస్పీ అధికారులతో కలిసి మంత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ గండి వల్ల మడిచర్ల, ఇతర ప్రాంతాలకు సాగర్ జలాలు రాక సాగునీరు అందటం లేదని రైతులు, నాయకులు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఈ మైనర్ కాలువ మరమ్మతులకు రూ. 25 లక్షలు కేటాయించి, వచ్చే సీజన్‌లో 3 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు అందించాలన్న పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి పాడేరు రిజర్వాయర్‌కు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించగా రామచంద్రపురం కాలువకు నెల రోజుల క్రితం నీరు చేరిందన్నారు. అయితే నూజివీడు, వేంపాడు మేజర్ కాలువకు ఈ నీరు సరిపోదని, నీటిని పెంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరి మరో 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నీరు సజావుగా ముందుకు సాగేందుకు పాడేరు వద్ద కాలువను యుద్ధ ప్రాతిపదికన రూ. 1.30 లక్షలతో బాగుచేయించి వేంపాడు చివరి ఆయకట్టు వరకు సాగర్ జలాలను తీసుకువెళ్ళిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వైసీపీ అసమర్థ పాలన వల్ల వేంపాడు మేజర్, మైనర్ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత ప్రభుత్వ, కూటమి ప్రభుత్వ పాలనకు గల తేడాను రైతులు, ప్రజలు గమనించాలని మంత్రి కోరారు. అనం తరం 30 ఏళ్ళ తరువాత కాట్రేనిపాడులో సాగర్ జలాలతో పూర్తి స్థాయిలో నిండిన పెద్దచెరువులో నీటికి మంత్రి పూజలు చేశారు. సర్పంచ్ సుహాసిని మోహన్‌రావు, వేంపాడు మేజర్ చైర్మన్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ చలమాల వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, బలివే ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం కీలకం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

ఏలూరు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మన సంపూర్ణ ఆరోగ్యానికి కీలకమని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సైకియాట్రి విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సిహెచ్ వంశీకృష్ణ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సైకియాట్రి విభాగంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) ఈ ఏడాది నినాదంగా విపత్తులు ఆపత్కాలంలో మానసిక ఆరోగ్య సేవలకు ప్రాధాన్యత అని ప్రకటించిందన్నారు. నేటి వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, ఆందోళన, ఇతర మానసిక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. కష్టాలు వచ్చిన సమయంలో మానసికంగా కుంగిపోకూడదని తగిన మద్దతు, సలహా, చికిత్స పొందాలన్నారు. మానసిక సమస్యలను దాచి పెట్టకుండా సహాయం కోరడానికి ముందుకు రావాలని సూచించారు. కో-ఆర్డినేటర్ డి. శ్రీనివాసరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లికి వచ్చి విద్యుదాఘాతంతో ఒకరి మృతి



నాగచంద్రరావు మృతదేహం

కొయ్యలగూడెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి పెళ్లికి వచ్చి ఒక వ్యక్తి మృత్యువాతకు గురయ్యాడు. ఈ సంఘటన మండలంలోని రామానుజాపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో టి.నర్సాపురం మండలం శ్రీరామ వరం గ్రామానికి చెందిన పరిటాల నాగచంద్రరావు(42) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. ఈ సంఘటనపై ఎస్.ఐ. చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మృతుడు నాగచంద్రరావు కొయ్యలగూడెం మండలం రామానుజాపురం బంధువుల వివాహానికి ఈ నెల 9న వచ్చాడు. బంధువుల ఇంటి వద్ద చెత్త ఎక్కువగా ఉండటంతో ఆ చెత్తను బంధు వులతో నాగచంద్రరావు శుభ్రం చేస్తున్నాడు. ఆ చెత్తలో ఇనుప ఊస ఉండటంతో అది తీస్తుండగా 11కేవీ విద్యుత్ వైరుకు తగిలింది. దీంతో నాగచంద్రరావును జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఆక్వా చెరువులపై కాపలా ఉంటున్న యువకుడి మృతి..

ఉండి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఉండి మండలం ఆరేడు గ్రామంలో ఆక్వా సాగు చేస్తున్న నాగేశ్వరరావు, సుబ్బారావు అనే రైతుల చెరువులపై పనిచేస్తున్న చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బహదూర్(19) అనే యు వకుడు శనివారం సాయంత్రం చెరువులో మేత వేసేందుకు వెళ్లగా విద్యుత్ మోటార్ వైర్ తగిలి షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎండీ నజీరుల్లా తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడి వద్ద లభించిన కార్డు

ఏలూరు క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆశ్రం ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో నడిచి వెళ్తున్న యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి వద్ద లభించిన ఐడీ కార్డు ప్రకారం కె.శ్రీనివాసులు, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్ అని మాత్రం ఉంది. అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు నిర్ధారించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

కేసు దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో సుత్తితో తలపై మోది, కత్తెరతో ఛాతీలో పొడిచి హతమార్చిన భర్తను ఏలూరు త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు శనివారం అరెస్టు చేశారు. ఏలూరు శనివారపుపేటకు చెందిన కూతాడ నాగలక్ష్మి(32)కి, భర్త నరేశ్, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త తాపీపనులకు వెళ్తూ ఉంటాడు. మద్యానికి బానిసైన నరేశ్ తన భార్యపై తరచూ అనుమానం పడుతూ కొడుతూ ఉండేవాడు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం పూటుగా మద్యంతాగి భార్యపై అనుమానంతో సుత్తిపై తలపై మోది కత్తెరతో ఛాతీలో పొడిచాడు. ఆమెను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడైన నరేశ్‌ను శనివారం అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.




సమావేశంలో పాల్గొన్న కోర్టు మోనటరింగ్ సిబ్బంది.. మాట్లాడుతున్న ఏఎస్పీ

నేరస్థులకు శిక్ష వేయించేలా సిబ్బంది పని చేయాలి : ఏఎస్పీ

ఏలూరుక్రైం, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): నేరం రుజువైన వారికి శిక్షపడేలా సమర్థవంతంగా కోర్టు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించాలని ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు ఆదేశించారు. ఏలూరు జిల్లా కోర్టు మోనటరింగ్ విభాగం సభ్యులతో ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకోకూడదని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు కోర్టులో జరిగిన ప్రక్రియను డాక్యుమెంటు చేసి స్టేషన్ అధికారులకు నివేదికలు అందించాలన్నారు. కేసు విచారణ సమయంలో సాక్ష్యులను సకాలంలో కోర్టుకు హాజరుపర్చాలని ప్రతి కోర్టులో న్యాయ విచారణలో ఉన్న కేసుల వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో కోర్టు మోనటరింగ్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.




మద్యం లేబుళ్లు పరిశీలిస్తున్న సిబ్బంది.. తనిఖీల్లో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆవులయ్య

మద్యం షాపుల్లో విస్తృతంగా తనిఖీలు

ఏలూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం ఎక్కడా లేకుండా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు గ్రామంలో పలు మద్యం షాపులను శనివారం తనిఖీ చేశారు. ఏలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించామన్నారు. కల్తీ మద్యంపై ఎటువంటి నమూనాలు లేవని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని ఆయన కోరారు. ఏలూరు జిల్లాలో ఆరు నెలల్లో 573 కోట్ల 23 లక్షలకు గాను 636కోట్ల 87లక్షల ఆదాయం సాధించామని, కల్తీ అనేది లేదని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు పాల్గొన్నారు.

నరసాపురం పట్టణంలో..

నరసాపురం: పట్టణ, మండలంలో శనివారం మద్యం షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ రాంబాబు ఆధ్వర్యంలో పలు మద్య దుకాణాలు, గతంలో బెల్టు షాపులు నిర్వహించిన బడ్డీ కొట్టు, ఇళ్లల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 117మంది బెల్టు షాపుల నిర్వహకులపై కేసులు నమోదు చేసి, 135 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అన్ని మద్యం షాపుల్లో ఐ-యాప్‌ను ఏర్పాటు చేసి నాన్ డ్యూటీ పేయిడ్, ఎమ్మార్పీ ధరల్ని పరిశీలిస్తున్నామన్నారు. దాడుల్లో ఎస్.ఐ.లు ఖాసీం, జైనుల్లా బుద్దీన్‌లు పాల్గొన్నారు.



ఉండి కేవీకేలో వరి యంత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

వ్యవసాయ ఉత్పాదకత పెంపే ధ్యేయం

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ఉండి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ ఉత్పాదకత పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే ప్రధాన మంత్రి ధన, ధాన్య కృషి యోజన ప్రధాన ధ్యేయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శనివారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాని ప్రసంగాన్ని మంత్రితో పాటు భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు, కలెక్టరు నాగరాణి, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, కూటమి నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి వర్మ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా వంద జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వ్యవసాయాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. గత ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలన్నారు. జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ పథకాన్ని రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో అమలు చేస్తున్నారన్నారు. ఉండి కేవీకేలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వివిధ మొక్కల పెంపకం, వరిసాగును పరిశీలించారు. ఆధునిక యంత్రాలను పరిశీలించారు. సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వర్లు, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మల్లికా ర్జునరావు, శాస్త్రవేత్తలు డిబోరా మెషియానా, శ్రీనివాసరావు, బిందు ప్రవీణ, వినయలక్ష్మి, మండల వ్యవసాయాధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉండి కేవీకేలో రైతులకు అవసరమయ్యే వరి విత్తనాలను అందు బాటులో వుంచాలని పలువురు నాయకులు, రైతులు సమావేశంలో కోరారు.

ఆటో కార్మికులను ఆదుకుంటాం : మంత్రి దుర్గేశ్



మంత్రి దుర్గేశ్‌కు స్వాగతం పలుకుతున్న జనసేన నాయకులు, ఆటోడ్రైవర్లు

కొయ్యలగూడెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని పొంగుటూరు గ్రామంలో రైస్‌మిల్లు ప్రారంభోత్సవానికి వెళుతూ కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో జనసేన నాయకుల్ని కలిశారు. అనంతరం గణపతి ఆలయంలో పూజలు చేశారు. ఆటో కార్మికులు, జనసేన నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమకు ప్రభుత్వం సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన జోనల్ కమిటీ సభ్యుడు చోడిపిండి సుబ్రహ్మణ్యం, మండల ప్రధాన కార్యదర్శి ఏపూరి సతీశ్, పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, నాయకులు నక్కా బాబి, మత్తా శ్రీను, సంకు మధు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చెట్టు ఎక్కిన ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాపులపాడు మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన వి.కోటేశ్వరరావు (45)హనుమాన్ జంక్షన్ వద్ద రైల్వే బ్రిడ్జి సమీపంలో మామిడి ఆకుల నిమిత్తం శనివారం సాయంత్రం మామిడి చెట్టు ఎక్కాడు.ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా అరెస్టు

పెదపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం తాళ్లమూడి గ్రామంలో కంభం రవికి చెందిన డోర్ నెంబరు 2-1 బిల్డింగ్‌పై పోర్షన్‌లో కొంతకాలంగా వ్యభిచారం జరుగుతున్నట్టు పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి శనివారం దాడి చేసి నలుగురు నిర్వాహకులు, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదాసతీశ్ తెలిపారు. బొబ్బిలి చిట్టియ్య, కొనకళ్ల వెంకటేశ్వరరావు, బత్తుల మాధవ సంఘంలను అరెస్ట్ చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణ పడిన ఇద్దరిపై కేసు

టి.నర్సాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇంటిస్థలం విషయంలో గొడవపడి ఘర్షణ పడిన ఘటనలో ఇద్దరిపై పరస్పరం కేసులు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. సాయంపాలెం గ్రామ శివారులో బ్రాందీ షాపు వద్ద ఈ నెల 5న బొడ్డు రామతేజకు, మానుకొండ రాజుకు మధ్య ఇంటి స్థలం విషయంపై వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. వీరిద్దరు గాయపడగా వారిద్దరినీ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఇరువురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు విద్యలో మంచి మార్కులు సాధించేందుకు క్రమ శిక్షణ అవసరమని జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు అమీనాపేటలో ఉన్న సోషల్ వెల్ఫేర్ హాస్టర్ విద్యార్థినులకు శక్తియాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ విద్యతో పాటు భద్రతా చట్టాలపై అవగాహన అత్యంత ముఖ్యమన్నారు. శక్తియాప్ మహిళా భద్రత కోసం రూపొందించిన ఎమర్జెన్సీ రెస్పాన్స్ అప్లికేషన్ అని వివరించారు. ఏపీ పోలీస్ శాఖ దీనిని అభివృద్ధి చేసిందని, మహిళలు, బాలికలు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీస్ సహాయం పొందడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీస్ సహాయాన్ని పొందవచ్చని వివరించారు. కాల్ చేసి పది నిమిషాల్లోపే పోలీసులు చేరుకుంటారన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూళ్లు కాలేజీల వద్ద శక్తి టీమ్ సభ్యులు గస్తీ తిరుగుతూ విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే వారిని అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థినులు శక్తిటీమ్ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. మహిళా ఎస్ఐ నాగమణి గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఎస్‌డబ్ల్యువో తిక్కా వెంకటేశ్వర్లు, ఇందిరాదేవి, పుష్పలత పలువురు పాల్గొన్నారు.

ముండూరు సొసైటీ ఆవరణలో నేడు ఉచిత వైద్య శిబిరం

పెదవేగి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండూరు సొసైటీ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు సొసైటీ చైర్మన్ కొనకళ్ల శివమణి తెలిపారు. విజయవాడ సెంటిని హాస్పిటల్ సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవలో ఉచిత శస్త్రచికిత్సలు కూడా చేయించే ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన అవసరం

టి.నర్సాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కీటకజనిత వ్యాధుల నివారణ అవగాహనతోనే సాధ్యమని చింతలపూడి మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్ఏ ప్రసాద్ తెలిపారు. తిరుమలదేవిపేట గ్రామంలో విష జ్వరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మండలంపై జ్వరాల తగ్గించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. సీహెచ్ ఎం.కిశోర్‌బాబు, సబ్‌యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.ప్రియాంక, వీహెచ్ ఎన్.రేవతి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ, ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్లు వేర్వేరుగా ఆందోళనలు నిర్వహించాయి. ఆర్.ఆర్.పేట మస్టర్ పాయింట్ వద్ద, నగరపాలక సంస్థ వద్ద ఈ రెండు యూనియన్ల కార్మికులు శనివారం నిరసనలు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జగన్‌బాబు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ పేరిట ప్రైవేటీకరణ విధానాన్ని అమలు చేసే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. తక్షణమే ప్రైవేటీకరణ నిలుపుదల చేసి ఆప్కాస్ విధానంలో కార్మికులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ విధానం, ప్రైవేటీకరణను అవలంభిస్తే రాష్ట్ర వ్యాప్తం ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్మిక సంఘాల నాయకులు ఎం.వెంకన్న, గోపి, లావేటి కృష్ణారావు, బంగారు వెంకటేశ్వరరావు, దుర్గారావు, అనిల్ పాల్గొన్నారు.

22 నుంచి కార్తీక మాస అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పత్తేబాదలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీవోదేశ్వర రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 22 నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీకమాస అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ మరకా శివయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహ రాజు సతీశ్ కుమార్, ధర్మకర్తలు తెలిపారు. ఈ నెల రోజులు ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అభిషేకాలు, అర్చనలు, ఆకాశ దీప కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వారి వెంట ధర్మకర్తలు అబిమళ్ల శ్రీనివాస్, తాళ్ల గంగ, నిడమర్రి శ్రీలక్ష్మి సూర్యతేజ కుమారి, తాతర్ల వెంకట దుర్గ, రామే శ్వరపు సౌజన్య, గారపాటి పణిరాజ్ కుమార్, శీల దుర్గాప్రసాద్, మారుబరిక శ్రీనివాసరావు, కృష్ణమోహన్ ఉన్నారు.

జేపీ యూత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా నాయకుడు జయప్రకాశ్ నారాయణ 125వ జయంతి సందర్భంగా స్థానిక జేపీ యూత్ అధ్యక్షుడు పొదిలి పణి శర్మ ఆధ్వర్యంలో ఉచిత స్పెషాలిటీ, మెడికల్ క్యాంపు నిర్వహించారు. పట్టణ ఎస్.ఎ.ఎస్.కె.జబీర్ ముఖ్యఅతిథిగా హాజరై జేపీ సెంటర్‌లోని జయప్రకాశ్ నారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయి దుర్గ ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ప్రారంభించారు. జేపీ యూత్ సభ్యులు మల్లవరపు సత్యనారాయణ,షేక్ ముస్తఫా, తూటికుంట రాము, కొండేటి నాగు, జుజ్జూరి శ్రీనివాసరెడ్డి, దాసు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని సీఎం నెరవేర్చడంతో వీవోఏల హర్షం

కుక్కునూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వీవోఏల మూడేళ్ల కాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తానని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి వట్టి సుభాషిణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం కుక్కునూరులోని సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో వీవోఏ అభినందన సభ నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అభినందన తెలుపుతూ సభ నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం 2019లో వీవోఏల మూడేళ్ల కాలపరిమితిపై సర్క్యులర్ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఆ సర్క్యులర్‌ను రద్దు చేశారని, తామంతా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభలో వీవోఏ ఉద్యోగులు కుర్రా గ్రేసీ, మేడబరపు రమణమ్మ, మాధవి, నాగలక్ష్మి, రాజకుమారి, కీర్తన, దీప్తి, ఏసుకుమారి, మాధవి పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలలు ఉండాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం తగదని, ప్రభుత్వ రంగంలోనే ప్రైవేటు కాలేజీలు నిర్వహించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రమేశ్ పేర్కొన్నారు. ఎన్ఆర్ పేటలోని జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటువారికి మెడికల్ కళాశాలలను అప్పగిస్తే వ్యాపార ధోరణితోనే పని చేస్తారే తప్ప సేవాదృక్పథం ఉండదన్నారు. రిటైర్డ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రావి గో పాలకృష్ణయ్య, రిటైర్డ్ జడ్జి ఆదూరి లక్ష్మీరంగారావు, నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, నీలం శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు బండి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడంతాదని వ్యాఖ్యానించారు. ఎ.వి. సుధాకర్, దేవేంద్ర అప్పారావు, అఖిల్, బొడెం శ్రీనివాసరావు, వి.గంగాధర రావు, టి.నళిని, వి.జి.ఎ.ఎ.ఆర్.కృష్ణారావు, స్వరూపరాణి, పి.వి.శాస్త్రి, నిర్మల, సాయి రమేశ్, సుందరయ్య, కూనా కృష్ణారావు, రవీంద్రనాథ్, జయపాల్, పెరియార్ పాల్గొన్నారు.

దేశ వైభవానికి హిందువులు ఏకం కావాలి

దెందులూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ వైభవం కోసం హిందువులంతా భాగస్వాములు కావాలని, రాబోయే రోజుల్లో ఐదు అంశాలతో సంఘం పని చేయబోతుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నాయకులు మెదటిపర్తి సీతారామాంజనేయులు(రాజబాబు) అన్నారు. శనివారం దెందులూరు ఎస్ఎంఆర్‌నగర్ సమీపంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దెందులూరు మండల శాఖ ఆధ్వర్యంలో వందేళ్ల పూర్తయిన సందర్భంగా విజయదశమి ఉత్సవాలను జరిపారు. బండ కార్యవాహ వక్త చల్లి కిశోర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సభ్యులు శేఖర్, శ్రీనివాస్, బాజాపా మండల అధ్యక్షులు చీకటి లక్ష్మీపతన్న పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే ఘన సన్మానం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో చింతలపూడి నియోజకవర్గం నుంచి 149 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందడం అభినందనీయమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక బాలాజీ గంగారావుల కల్యాణ మండపంలో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులుగా ఎంపికైన 149 మందికి పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అధ్యక్షతన సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేయడంతో అనేక కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో చేరే ఉపాధ్యాయులందరూ భావితరాలకు ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని సూచించారు.

డిగ్రీ.. డీలా

(5వ పేజీ తరువాయి)

పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అవకాశం కల్పించింది. డిగ్రీ అభ్యసనలో ఈ ఏడాది నుంచి కళాశాలలకు నేరుగా విద్యార్థి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం తెచ్చింది. అయినా డిగ్రీపై విద్యార్థులు మక్కువ చూపలేదు. గత ఏడాదికంటే 10 శాతం అడ్మిషన్లు తగ్గడం గమనార్హం.

కంప్యూటర్ కోర్సులున్నా మక్కువ లేదు : గతంతో పోలిస్తే ఇప్పుడు డిగ్రీ కోర్సుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. గతంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు మాత్రమే ఉండేవి. ఇప్పుడు వాటిలోనే అనేక కాంబినేషన్లు మార్పులు చేసుకున్నాయి. దాదాపు 25 కోర్సులు కొత్తగా అందుబాటులో వచ్చాయి. బీకాంలోను కంప్యూటర్ ఉంది. ఇంజినీరింగ్‌లో ఉన్నట్టుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు ఉన్నాయి. వీటి ద్వారా డిగ్రీ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. అయినా విద్యార్థులు ఇంజనీరింగ్ వైపే మక్కువ చూపుతున్నారు.

పల్లె మారుతోంది..!

(5వ పేజీ తరువాయి)

అసిస్టెంట్ కమ్ బిల్ కలెక్టర్లలో సీనియార్టీని బట్టి పదోన్నతులు కల్పిస్తారని చెబుతున్నారు. వారిని రూర్బన్ పంచాయతీలలోనే సీనియర్ అసిస్టెంట్లుగా నియమించి పాలనను మెరుగుపరచాలని నిర్ణయించారు.

మునిసిపాలిటీ తరహాలో విభాగాలు: పంచాయతీరాజ్ ప్రక్షాళనలో భాగంగా మునిసిపాలిటీ తరహాలో పలు విభాగాలను పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీల్లోను పలు విభాగాల ద్వారా విస్తృత సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళికా విభాగం, వీధిలైట్లు విభాగం, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలుగా విభజించనున్నారు. ఈ విభాగాల ద్వారా ప్రజలకు విస్తృత సేవలందించేందుకు అవకాశముంటుందని భావిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించుకోవచ్చని ప్రభుత్వం సూచిస్తోంది. వారికి పంచాయతీలే సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లిస్తారని తెలుస్తోంది. అదనంగా ఇన్ని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను ఇక పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్లుగా గుర్తించి వారి సేవలను వినియోగించుకుంటారు. వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో భవనాలు, లేఅవుట్స్ రూల్స్ అమలు చేస్తారని చెబుతున్నారు. ప్రత్యేకమైన ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేసి అదనంగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్, ఇతర అర్హత కలిగిన సిబ్బందిని ఉపయోగించి పంచాయతీల్లో డిజిటల్ విభాగాన్ని అభివృద్ధి చేస్తారు. పంచాయతీల్లో రికార్డులు డిజిటలైజ్ చేసి రియల్ టైమ్‌లో పంచాయతీల ద్వారా సర్వీసులు అందించేందుకు యంత్రాన్ని బలోపేతం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పంచాయతీరాజ్ ప్రక్షాళనలో భాగంగా మొదట ఉద్యోగుల పదోన్నతుల సమస్యల పరిష్కారానికి ఆ శాఖ చేసిన ప్రతిపాదనలకు తొలుత ఆమోదించిన రెండో విడత సంస్కరణల్లో భాగంగా పంచాయతీల రీ కేటగిరైజేషన్ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

గుండేరుపై వంతెన పునర్నిర్మించాలి

- వరదలకు కొట్టుకుపోయిన వంతెన
- 15 ఏళ్లుగా పట్టించుకోని పాలకులు
- ప్రతిపాదనలు పంపామన్న అధికారులు


ప్రమాదకరంగా ఉన్న గుండేరు వంతెన

లింగపాలెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): భారీ వరదలకు రెండు మండలాల మధ్య ఉన్న వంతెన కొట్టుకుపోయి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగపాలెం మండలం ఆసన్నగూడెం, కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామాల మధ్య ఉన్న గుండేరు వంతెన భారీ వరదలకు కూలిపోయి 15 ఏళ్లు దాటింది. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి నుంచి ఈ వంతెనను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సిమెంటు తూరలతో తాత్కాలిక వంతెన నిర్మించగా ఆ తరువాత వచ్చిన వరదలకు అదికూడా కొట్టుకుపోయింది. దీంతో కూలిన వంతెనపై మట్టిపోసి భయంభయంగా ద్విచక్రవాహనదారులు, ఆటోలు, చిన్న వాహనదారులు మాత్రమే వంతెన దాటుతున్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు ఈ వంతెన అనుకూలంగా లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ మార్గంలో వందలాది మంది విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, రైతులు ప్రయాణిస్తుంటారు. ఈ తాత్కాలిక వంతెన కూడా లేకపోతే ఈ మార్గంలో ప్రయాణించాలంటే విద్యార్థులు చదువుకునేందుకు వెళ్లాలన్నా, రైతులు తమ పంటలను తరలించాలన్నా 10 నుంచి 15 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సివస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ వంతెనే తిరిగి నిర్మించాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ప్రజలు స్థానిక ఎమ్మెల్యే రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. ఇదే విషయమై ఆర్అండ్‌బీ ఏఈ ఎస్ సుందరరావును వివరణ కోరగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ సహకారంతో రూ.6 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతామన్నారు.

విద్యార్థి నాయకుడు శ్రీనివాస్‌కు ఏయూ డాక్టరేట్ ప్రదానం



ఏలూరు రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బి.ఎస్.ఎఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్‌కు ఆంధ్రాయూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసింది. ఆంధ్రా యూనివర్సిటీలోని రాజనీతి శాస్త్ర, ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం గైడెన్స్‌లో పీహెచ్‌డీ పరిశోధనను పూర్తి చేశారు. రాజనీతి శాస్త్రంలో (పొలిటికల్ సైన్స్)లో షెడ్యూల్ కులాల్లో రాజకీయ చైతన్యం, రాజకీయ భాగస్వామ్యం అనే అంశం మీద పీహెచ్‌డీ పరిశోధన పూర్తి చేసినందుకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీపీ రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

దెందులూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించిన భక్తులకు దాత, టీడీపీ పోతునూరు గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, పద్మావతి దంపతులు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో భక్తులు పాల్గొని భిక్షను స్వీకరించారు. ఏటా అయ్యప్ప స్వాములకు రోజుకు ఒకరు చొప్పున దాతలు ముందుకు వచ్చి అన్నదానం, స్వాములకు భిక్షను బ్యాంక్ అధ్యక్షులు మోహన్‌బాబు ఆర్గనైజింగ్ నిర్వహిస్తారు. నున్న లక్ష్మణ్ పద్మావతి దంపతులు స్వాములకు పలు రకాల పిండివంటలు, అల్పాహారం అందించారు. గురుస్వాములు గంగరాజు గురుస్వామి, పరిటాల కొండస్వామి దుర్గా ప్రసాద్, బిళ్ల వీర్రాజు, బుద్ధా సాంబశివరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ద్వారకాతిరుమల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గుణ్ణంపల్లిలో నిర్వహిస్తున్న ఓపేకాట స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈదాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.1900 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సుధీర్ తెలిపారు.



నాణ్యమైన వైద్య సేవలందించాలి

పెదపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణలో తగిన సలహా, సూచనలు అందించాలని పెదపాడు డీసీ అధ్యక్షులు బొప్పుడి కాశీబాబు తెలిపారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నదిమానాలు వైద్య సిబ్బందికి అవసరమైన రెండు బీపీ చెకప్ పరికరాలను డీసీ అధ్యక్షులు కాశీబాబు అందజేశారు. పెదపాడు పీహెచ్‌సీ డాక్టర్ చక్రధర్ మాట్లాడుతూ బీపీ చెకప్ పరికరాలందజేయడం సంతోషకరమన్నారు. ఏఎన్ఎం ప్రవీణ, అరుణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన

లింగపాలెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సహజ పద్ధతుల్లో జీవామృతం, కషాయాలు, ఆవుపేడ వంటి వాటిని ఉపయోగించడం వలన ఆరోగ్యకరమైన పంటలతో పాటుగా భూసారం కూడా పెరుగుతుందని జి.విజయలక్ష్మి, రజని అన్నారు. మండలంలోని చంద్రన్నపాలెంలో రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న, పొగాకు, మిరప పంటలకు వేప, గానుగ, ఎమ్మెల్త పలు రకాల ఆకులతో సహజ పద్ధతుల్లో తయారు చేసిన జీవామృతం, బ్రహ్మాస్త్రం వాడాలని తెలిపారు. స్థానిక రైతులతో కలిసి వాటిని తయారు చేసే విధానం గురించి వారికి వివరించారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

ధన-ధాన్య కృషి యోజనపై పీఎం కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఏలూరు రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి సూచించారు. శనివారం ఏలూరు మార్కెట్ యార్డులో నిర్వహించిన పీఎం ఆత్మ నిర్భరతా మిషన్‌లో భాగంగా ప్రధాని మోదీ పీఎం ధనధాన్య కృషి యోజన, దల్హన్ ఆత్మ నిర్భరత మిషన్ అనే రెండు కీలక వ్యవసాయ పథకాలను ఢిల్లీలో అధికారికంగా ప్రారంభించగా ఆ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. అనంతరం యార్డ్ చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా, రాయితీ యంత్రాలు, మట్టి పరీక్ష ఫలితాలు అందిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్రాలు రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. వ్యవసాయశాఖ జేడీ ఎస్.కె.హబీబ్ బాషా, ఏడీఏ అనిల్‌కుమార్, ఎంఏవో జీవన సంధ్య, యార్డ్ సెక్రటరీ జి మంజుల, మార్కెటింగ్ ఏడి మహేంద్రనాథ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి మండలంలో..

జీలుగుమిల్లి: ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన కార్యక్రమం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారని జీలుగుమిల్లి పశు వైద్యశాల సహాయ సంచాలకులు పి.సాయిబుచ్చారావు అన్నారు. ప్రధాని మోదీ ఢిల్లీలో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు వీక్షించారు. ప్రధాన మంత్రి ప్రారంభించిన పప్పుధాన్యాల స్వయం సమృద్ధి, పశు వైద్య అధికారులు పాల్గొన్నారు. పప్పుధాన్యాల స్వయం సమృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, పథకాల ద్వారా రైతుల జీవితాల్లో మార్పు కోసం పథకాల్ని కేంద్రం అమలు చేస్తుందని ఏవో ఉన్నారు. ఏలీఎస్ రాజు, భవానీ, సిబ్బంది కల్యాణి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పోడుభూములకు పట్టాలివ్వండి

వేలేరుపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ ముస్తీర్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తరతరాలుగా ఆదివాసి గిరిజనులు అడవినే నమ్ముకుని పోడు భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. రైతులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఐటీడీఏ వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. పోడుభూములకు పట్టాలివ్వకపోతే గిరిజనుల తరఫున సీపీఐ అండగా ఉంటుందని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిస రాము, మండల సర్పంచ్ పిట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు నిత్యం వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటిస్తూ తాము సూచించిన ప్రకారం మందులు వేసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బి.వి.ఎం.ఎస్.సి. పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ నిర్వాహకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం శివాలయం ప్రాంగణంలో నగేశ్ వైద్య సేవలందించారు. 92 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో సలహాలు, సూచనలు ఇచ్చి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో పిల్లి వందరీనాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్, లోకేశ్ పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని

గాలాయగూడెంలో విగ్రహ ప్రతిష్ఠ..

దెందులూరు: గాలాయగూడెం గ్రామ దేవత గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్యాంక్ అధ్యక్షుడు పూజారి వెంకటరత్నం నాయుడు, వెన్నమనేని రాజా, మాజీ సర్పంచ్ వేగుంట రాణీ కిశోర్, కొప్పాక కొండ, వీరంకి రామకృష్ణ, దొడ్డి రమేశ్, పూజారి రాజశేఖర్, మేక నాగేశ్వర్ పాటు నాయకులు పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

పెదవేగి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యంగా పనిచేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొప్పాకలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ ఉప కేంద్రానికి ఎమ్మెల్యే ప్రభాకర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదవేగి మండలంలో రైతులు పుష్కలంగా గొట్టపుబావులపై ఆధారపడి సాగు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనే ధ్యేయంతో నూతనంగా విద్యుత్ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా అందించేందుకు రూ.50 కోట్లతో ఈ విద్యుత్ ఉప కేంద్రం నిర్మిస్తున్నామని, కొప్పాక పరిసర గ్రామాలతో పాటు పెదపాడు మండలం, ఏలూరు ప్రాంతానికి కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సర్పంచ్ వరికూటి భాస్కర దీక్షితులు, ఎపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం.అంబేడ్కర్, కొప్పాక, విజయరాయి సొసైటీ అధ్యక్షులు కొసరాజు వీరవెంకట వరప్రసాద్, బొప్పన సుధాకర్, కొప్పాక పార్వతమ్మపల్లి ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న చేయూత సభ్యులు

పేద కుటుంబానికి 'చేయూత' సాయం

పెదవేగి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తండ్రి అకాల మరణంతో ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్న ఓ పేద కుటుంబానికి చేయూత సభ్యులు అండగా నిలిచారు. ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. పెదవేగి మండలం వేగివాడకు చెందిన ముళ్లగిరి సత్యనారాయణ రవి కుమార్ రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో స్వరూపరాణి కుమార్తె లోహిత, కుమారుడు రిషితో ఇబ్బందులు పడుతుండగా మేనమామ సాగర్ వారికి అండగా నిలిచారు. మేనమామ సాగర్ కూడా ఆరునెలల కిందట ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడంతో ఆ తల్లి కష్టాన్ని గమనించిన చేయూత సభ్యులు చెందిన వ్యక్తి ఆదెల కుండా ఉండమని ఇల్లు ఇచ్చారు. వారి దీనస్థితిని తెలుసుకున్న చేయూత సభ్యులు శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల నగదుతో పాటు నానిమిట్టా బియ్యం బస్తా అందించారు. చేయూత సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున, మరీదు లక్ష్మణరావు, వేమూరి రాజేంద్ర, రాజనాల మహేశ్ పాల్గొన్నారు.


పిచ్చిచెట్లతో నిండి ఉన్న రోడ్డు


రోడ్డుపైకి చేరిన మురుగు

ఈ రోడ్డును పట్టించుకోండి మహాప్రభో..

ద్వారకాతిరుమల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పిచ్చి మొక్కలతో మరికొన్ని కాలనీల కూడా ఉన్న ఇది రోడ్డంటే ఎవ్వరూ నమ్మరు. కానీ ఇది రోడ్డే. మండల పరిషత్ కార్యాలయాల సముదాయానికి, పోలీస్‌స్టేషన్ కూత వేటు దూరంలో ఉన్న ఈ రోడ్డును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అటు పంచాయతీ పాలకులు, ఇటు అధికారులు కూడా శ్రద్ధ చూపడం లేదు. దీంతో ఇది నడక దారిగా లేకపోవడంతో ఆ ప్రాంత వాసులు కొన్నాళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే మొక్కలు మొలిచి, ఇళ్లలోని మురుగు చేరి దోమలు, దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. అయినా అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడకపోవడంతో వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పక్కా డ్రైనేజీతో రహదారి నిర్మాణం చేపట్టి ఆప్రాంతవాసుల ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మోకాళ్ల నొప్పులపై అశ్రద్ధ వద్దు


మందులు అందిస్తున్న శ్రీకృష్ణ

ఏలూరు రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పేదలకు వైద్యసాయం అందిస్తున్నట్టు ప్రముఖ ఆర్థోస్పెషలిస్టు డాక్టర్ శ్రీకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు, విలువైన రక్త పరీక్షలతో పాటు మందులు అవసరమే చేయాల్సిన అవసరం ఉంటుందని, అలా కాకుండా మోకాళ్ల నొప్పులను గుర్తించిన వెంటనే వైద్యులు సంప్రదించాలని ఆయన సూచించారు. తన తండ్రి స్మృత్యార్థం సామాజిక సేవలో భాగంగా ప్రతినెల రెండవ శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

శ్మశానానికి భూమి చూపించాలని ఎమ్మెల్యేకు వినతి



చింతలపూడి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం పంచాయతీలో ఓసీ, ఎస్సీ, బీసీలకు సంబంధించిన శ్మశాన వాటిక భూమి ఆక్రమణకు గురైందని, దానిని తొలగించి న్యాయం చేయాలని, అదేవిధంగా సుబ్బాయయుగూడెంలో శ్మశాన వాటికలేదని, అక్కడ భూమి చూపించాలని కోరుతూ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ క్యాంపు కార్యాలయంలో వెంకటాపురం మాజీ సర్పంచ్ ఆది సత్యనారాయణ, గ్రామ దళితులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై సత్యనారాయణ మాట్లాడుతూ శ్మశాన వాటిక భూమి ఉన్నా ఆక్రమణలకు గురికావడం వలన గ్రామంలోని ప్రజలు రోడ్డుపక్కనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని, ఆక్రమణలు గుర్తించి శ్మశానాల స్థలాలను తొలగించి ఇవ్వడం, సుబ్బాయయుగూడెంలో స్థలం చూపించడం చేయాలని కోరినట్టు తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలపై ఊరూరా ప్రదర్శనలు

కామవరపుకోట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలంలోని గ్రామాల్లో శనివారం జీఎస్టీ సంస్కరణలపై సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు రాయితీలు వస్తున్నాయన్నారు. అన్ని రకాల వస్తువులపై తగ్గింపులు లభిస్తాయని, ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ మేరకు కామవరపుకోట, తడికలపూడి, ఆడమిల్లి, కళ్ళచెరువు, తూర్పుయడవల్లి, రామన్నపాలెం, రావికంపాడు తదితర గ్రామాల్లో జీఎస్టీ సంస్కరణ ర్యాలీలు నిర్వహించారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని ఏలూరు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఏలూరు నగరంలో అశోక్ నగర్ వంతెన సమీపంలో శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉంటేనే వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ద్వారా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించుకోవడానికి అవకాశం ఉంటుందని వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి: నగర పంచాయతీలోని బోసు బొమ్మ సెంటర్‌లో శనివారం సాయంత్రం ఎస్ఐ సతీశ్ కుమార్ వాహనాలను తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పానీయాలు సేవించి డ్రైవింగ్ చేయడం మితిమీరిన వేగం, అధికలోడు చేయవద్దని ఆయన సూచనలిచ్చారు.

బాణసంచా దుకాణాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి: సీఐ

కైకలూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్ అన్నారు. శనివారం కైకలూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో దుకాణాలదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఒక్కొక్క దుకాణానికి మధ్యలో కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద డ్రమ్ములతో నీరు ఏర్పాటు చేయాలని, పెట్రోల్ బంకులకు, గ్యాస్ గోడౌన్‌లకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు.

'సాగు భూములకు పట్టాలివ్వాలి'

చాట్రాయి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పేదలు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న అటవీ, బంజరు భూములకు పట్టాలివ్వాలని చాట్రాయిలో శనివారం జరిగిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మండల సమావేశం తీర్మానించింది. నాయకులు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేసి గోదావరి జలాలు అందించాలని, పేదలకు ఇళ్ళ స్థలాలు, పక్కా ఇళ్ళు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నవంబరు 1న నూజివీడులో జరిగే జిల్లా మహాసభలకు, డిసెంబరులో కడపలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు.





విద్యుద్దీపాలంకరణలో ఆలయ ప్రాంగణం.. కొలువుదీరిన ఉత్సవ మూర్తులు

అద్వితీయంగా..

- రెండో రోజు ఘనంగా బ్రహ్మోత్సవం
- ఆకట్టుకున్న ఫల, పుష్ప అలంకరణ
- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవిందా న్నామస్మరణలతో వాడపల్లి మారుమ్రోగింది.. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. ఆలయాన్ని ఫలపుష్పాలతో సర్వాంగ, సుందరంగా అలం కరించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రధాన హోమాలు నిర్వహించి సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటకు సరస్వతి అలంకరణలో శ్రీవారు హంస వాహనంపై విహరించి భక్తులకు అభయ హస్తం అందించారు. తిరువీధుల్లో విద్యుద్దీపాలు,మేళతాళ మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణల నడుమ హంస వాహన సేవ కన్నుల పండువగా నిర్వహించారు.





భారీ రహదారి గుంతలు పూడ్చివేత

చాట్రాయి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో చిత్తపూరు-బూరుగుగూడెం రహదారి(సీబీ రోడ్డు) పరిధిలో చాట్రాయి-జనార్ధనవరం గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న భారీ రహదారి గుంతలను శనివారం ఆర్‌అండ్ బీ అధికారులు ఎట్టకేలకు పూడ్చివేశారు. ఈ గుంతల వద్ద ద్విచక్ర వాహనాలు పడిపోయి పలువురు గాయపడగా, ఆటోలు, చిన్న కార్లు ఇరుక్కుపోయి కట్టలు విరిగి జనం నరకయాతనలు అనుభవిస్తున్నారు. ఈ రహదారిపై ప్రయాణం చెయ్యాలంటేనే వాహనచోదకులు హడలిపోయేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి కథనం కూడా ప్రచురించింది. ప్రమాదకర గోతుల సమస్యపై మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, జనార్ధవరం మాజీ సర్పంచ్ పలగాని దుర్గారావు, మండల నాయకుడు కలకొండ భాస్కరరావు నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్ధసారథి దృష్టికి తీసుకువెళ్ళటంతో వెంటనే స్పందించిన మంత్రి సారథి ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలివ్వటంతో గోతులు పూడ్చివేశారు. ప్రమాదకర గోతులు పూడ్చటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు ఉచిత కంటి, దంత పరీక్షలు

ఆగిరిపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా తోటపల్లి హీల్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించినట్టు రాష్ట్ర బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులకు ఉచితంగా కంటి, దంత పరీక్షలు నిర్వహించామన్నారు. బాల స్వాస్థ్య కార్యక్రమం వైద్య బృందం, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్, హీల్ సీఈవో అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ వై. లతాచౌదరి, హీల్ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ముసునూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టుమిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సీనియర్ టీడీపీ నాయకులు పాలడుగు నాగేంద్రబాబు, గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్రబాబు అన్నారు. శనివారం గోగులంపాడులో ఆశాజ్యోతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఇంటి వద్దే ఉండి, ఆర్థికంగా బలపడేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. శిక్షణ పొందిన వారికి ఈ ట్రస్ట్ ద్వారా కుట్టుమిషన్‌లు, సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు పాలడుగు ప్రశాంత్, వేగుంట రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



చెరువును తలపిస్తున్న మద్వానిగూడెం – పెదలంక రహదారి

వర్షాలతో రహదారి ధ్వంసం

- గోతుల్లో నిలిచిన నీరు
- అంచనా తెలియక పడిపోతున్న వాహనదారులు
- అధికారులు స్పందించాలని ప్రజల వినతి

కలిదిండి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మద్వానిగూడెం - పెదలంక రహదారి ధ్వంసమైంది. పెద్ద గోతులు పడటంతో అధ్వానంగా ఉంది. ఈ రహదారి 12 కిలోమీటర్లకు గాను సుమారు 6 కిలోమీటర్ల మేర భారీ వర్షాలకు గోతులు నిండిపోయి చెరువుల్లా మారాయి. గోతుల్లో కంకర కొట్టుకుపోవటంతో వాహనాలు గోతుల్లో దిగబడుతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిత్యం ఈ రహదారిపై పెదలంక, మట్టగుంట, యడవల్లి, కొండంగి, మద్వానిగూడెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిపై గోతులు పడటంతో కళాశాలలు, కాన్వెంట్లు బస్సుల రాకపోకలు సాగించకపోవటంతో విద్యార్థులు పలు అవస్థలు పడుతున్నారు. కనీసం ఆటోలు కూడ రాకపోకలు సాగించటం లేదని వాపోతున్నారు. రహదారి గోతుల మయంగా మారటంతో ప్రయాణీకులు నరకయాతన పడుతు న్నారు. నీటిలో గొయ్యి లోతు కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు సమస్యను అధికారులకు పలు మార్లు విన్నవించినప్పటికీ ఇంత వరకు రోడ్డు మరమ్మతులు చేపట్ట లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధి కారులు స్పందించి మద్వానిగూడెం-పెదలంక రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ ఏఈఈ వివరణ

ఈ విషయమై ఆర్ అండ్ బి ఏఈఈ అరవింద్‌ను వివరణ కోరగా, మద్వానిగూడెం - మట్టగుంట రహదారి మరమ్మతులకు గానూ రూ.2.3 కోట్లు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామన్నారు.

సొంత సొమ్ము వెచ్చించి
గోతుల్లో నీరు తోడించిన సర్పంచ్



ముదినేపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన కామన పూడి - లింగాల జడ్పీ రోడ్డు లోని గోతుల్లో నిలిచిన వర్షపునీరు తొలగింపు పనులను చినకామనపూడి సర్పంచ్ చిట్టూరి వీర వెంకట సత్యనాంచారయ్య తన వితరణతో చేపట్టారు. ఆ పంచా యతీ పరిధిలో సుమారు రెండు కిలో మీటర్ల దూరం ఏర్పడిన పెద్ద గోతుల్లో వారం రోజులుగా వాన నీరు నిలిచి వాహనాల రాకపోకలకే కాక, లింగాల హైస్కూలుకు వెళ్ళే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులను గుర్తించి సర్పంచ్ నాంచా రయ్య శనివారం గోతుల నుంచి నీటిని ప్రక్కనేవున్న కాల్వలోకి మళ్ళించే పనులు నిర్వహించారు. పంచాయతీలో నిధులు లేక, జడ్పీ అధికార్లు పట్టించుకోక పోవడంతో సర్పంచ్ నడుం బిగించారు. గోతులను పూడ్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేసేందుకు జిల్లా పరిషత్తు అధికార్లు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ నాంచారయ్య కోరారు.

రైతులకు పుష్కలంగా సాగు నీరందించడమే లక్ష్యం



కాల్వ గండిని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి తదితరులు

- కాట్రేనిపాడు వద్ద మైనర్ కాలువ గండి పరిశీలన
- రూ. 25 లక్షలతో కాలువగట్టు పటిష్ఠం చేస్తాం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ముసునూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు పుష్కలంగా సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కాట్రేనిపాడు వద్ద మైనర్ కాలువకు పడిన గండిని ఎన్నెస్పీ అధికారులతో కలిసి మంత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ గండి వల్ల మడిచర్ల, ఇతర ప్రాంతాలకు సాగర్ జలాలు రాక సాగునీరు అందటం లేదని రైతులు, నాయకులు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లా డుతూ ఈ మైనర్ కాలువ మరమ్మతులకు రూ. 25 లక్షలు కేటాయించి, వచ్చే సీజన్‌లో 3 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు అందించాలన్న పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి పాడేరు రిజర్వాయర్‌కు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించగా రామచంద్రపురం కాలువకు నెల రోజుల క్రితం నీరు చేరిందన్నారు. అయితే నూజివీడు, వేంపాడు మేజర్ కాలువకు ఈ నీరు సరిపోదని, నీటిని పెంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరి మరో 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నీరు సజా వుగా ముందుకు సాగేందుకు పాడేరు వద్ద కాలువను యుద్ధ ప్రాతిప దికన రూ. 1.30 లక్షలతో బాగుచేయించి వేంపాడు చివరి ఆయకట్టు వరకు సాగర్ జలాలను తీసుకువెళ్ళిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో 2 లక్షల 70 వేల ఎకరాలకు ఈ సీజన్‌లో సాగునీరు అందించామన్నారు. అయితే మడిచర్ల, ఇతర ప్రాంతాలకు సైతం వచ్చే సీజన్‌లో సాగునీరు అందించేలా కాలువ మరమ్మతులను తక్షణమే చేపట్టేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

వైసీపీ పాలనలో కాల్వలు అస్తవ్యస్తం

వైసీపీ అసమర్థ పాలన వల్ల వేంపాడు మేజర్, మైనర్ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని విమర్శించారు. గతంలో ఎన్నడూలేని విధంగా వేంపాడు మేజర్ ద్వారా సుమారు నెల రోజులకు పైగా సాగర్ జలాలను తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత ప్రభుత్వ, కూటమి ప్రభుత్వ పాలనకు గల తేడాను రైతులు, ప్రజలు గమనించాలని మంత్రి కోరారు. అనం తరం 30 ఏళ్ళ తరువాత కాట్రేనిపాడులో సాగర్ జలాలతో పూర్తి స్థాయిలో నిండిన పెద్దచెరువులో నీటికి మంత్రి పూజలు చేశారు. సర్పంచ్ సుహాసిని మోహన్‌రావు, వేంపాడు మేజర్ చైర్మన్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ చలమాల వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, బలివే ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పెదపాలపర్రులో అర్చకులకు నిర్మించిన భవనం (ఇన్‌సెట్) దాత హరిరామకృష్ణ ప్రసాద్

అర్చకుల కోసం ఇంటి నిర్మాణం
దాత గన్నమనేని ప్రసాద్ ఔదార్యం

ముదినేపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలపర్రులో గంగా సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆలయ అర్చకుల కోసం ఆ గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో స్థిరపడిన గన్నమనేని హరిరామకృష్ణ ప్రసాద్, దయాళ్ ప్యారీ దంపతులు రూ. 17 లక్షల విరాళాన్ని అందజేసి ఆ దేవస్థానం అర్చకుల కోసం నివాస గృహాన్ని అన్ని హంగులతో నిర్మించారు. శనివారం గృహప్రవేశం చేయించారు. గతంలో పురాతన పెంకుటింటి భవనం పాడై పోవడంతో గుర్తించిన హరిరామకృష్ణ ప్రసాద్ ఈ కొత్త భవన నిర్మించారు.

వైభవంగా గంగానమ్మ జాతర

కలిదిండి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేట కలిదిండిలో గంగానమ్మ జాతర శనివారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించగా, మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో ముగిసిన టెక్రియా-2025

- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్రియా-2025 వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రాంగణంలోని ఆయా శాఖల ఆధ్వర్యంలో చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈసీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లైర్‌మేజ్ చాలెంజ్ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ ఆటలో ఓ వ్యక్తి తన చేతికి గ్లైర్ స్కోప్‌ని అమర్చుకుని ఆడాల్సి ఉంటుంది. చేతికి ఉన్న గ్లైర్ స్కోప్‌ను అటు ఇటూ తిప్పడం ద్వారా కారు ముందుకు, వెనక్కి వెళ్తుంది. ఇలా ఎరుదుగా ఉన్న పలు అడ్డంకులను దాటుకుని నిర్ణీత సమయంలో గమ్య స్థానానికి చేరుకోవాలి. ఎవరైతే ముందుగా వెళ్తారో వారిని విజేతలకు ప్రకటిస్తారు. నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎకో పెయింటింగ్ పోటీలు చూపరులను అలరించాయి.




ఎకో పెయింటింగ్ ప్రదర్శన.. విద్యార్థిని నృత్యం



స్వామి దర్శనానికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

శోభనాచలుడికి ప్రతాప్ పూజలు

ఆగిరిపల్లి, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తన పుట్టినరోజు సందర్భంగా శనివారం ఆగిరిపల్లిలో వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, పల్లగాని నరసింహారావు, చిమట శ్రీనివాసరావు, మచ్చా హరిబాబు, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

పేర్ని నానిపై బీసీ నాయకుల ఆగ్రహం

కలిదిండి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నానికి బీసీలు అంటే చులకనా అని కైకలూరు నియోజకవర్గ బీసీ నాయకులు మండి పడ్డారు. కోరుకొల్లులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పేర్ని నాని మచిలీపట్నంలో పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సీఐ ఏసుబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని సీఐ ఏసుబాబుకి ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొచ్చెర్ల మాజీ సర్పంచ్ బుసనబోయిన పేర్రాజు, కొమరాపాలెపు సత్యనారాయణ, కైకలూరు నియోజకవర్గ యాదవ సంఘం ఉపాధ్యక్షుడు బుసనబోయిన అశోక్ కుమార్, నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు హక్కులపై అవగాహన ఉండాలి
ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

ముసునూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికలు తమ హక్కులపై అవగహన కలిగి ఉండి, అత్యాచారాలను, అనర్థాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కాట్రేనిపాడులో అంగన్ వాడీలు, మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న హింస, బలవం తపు బాల్య వివాహాలు తదితర వాటిపై అవగహన పెంచడమే ఈ దినోత్స వం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ర్యాలీలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.




రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న శ్రీనివాసరావు, జడ్పీటీసీ ప్రతాప్

పలగాని, వరికూటికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

చాట్రాయి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావుకు ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రసీ(అప్స) శనివారం గుంటూరులో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసింది. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, అప్స రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి మోహనరావు, సురేంద్ర రెడ్డి, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు తదితరుల చేతుల మీదుగా శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. శ్రీనివాసరావును ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముసునూరు: లోపూడి ఆశ్చర్య పాఠశాల ప్రిన్సిపాల్, శ్రీ వైష్ణవి విద్యాసంస్థల పరిపాలన అధికారి, జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. శనివారం గుంటూరు లో అప్సా డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, కార్యదర్శి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈ అవార్డుల కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కే.ఎస్ రామకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు ప్రతాప్‌కు అభినందనలు తెలిపారు.

డిగ్రీ.. డీలా

(5వ పేజీ తరువాయి)

పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అవకాశం కల్పించింది. డిగ్రీ అడ్మిషన్లలో ఈ ఏడాది నుంచి కళాశాలలకు నేరుగా విద్యార్థి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం తెచ్చింది. అయినా డిగ్రీపై విద్యార్థులు మక్కువ చూపలేదు. గత ఏడాదికంటే 10 శాతం వరకు అడ్మిషన్లు తగ్గడం గమనార్హం.

కంప్యూటర్ కోర్సులున్నా మక్కువ లేదు

గతంతో పోలిస్తే ఇప్పుడు డిగ్రీ కోర్సుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. గతంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు మాత్రమే ఉండేవి. ఇప్పుడు కాలానుగుణంగా మార్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు 25 కోర్సులు కొత్తగా అందుబాటులో వచ్చాయి. బీకాంలోను కంప్యూటర్ ఉంది. ఇంజనీరింగ్‌లో ఉన్నట్లుగా ఏఐ కోర్సులున్నాయి. వీటి ద్వారా డిగ్రీ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగాల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. అయినా విద్యార్థులు ఇంజనీరింగ్ వైపే మక్కువ చూపుతున్నారు.

పల్లె మారుతోంది..!

(5వ పేజీ తరువాయి)

అసిస్టెంట్ కమ్ బిల్లు కలెక్టర్లలో సీనియార్టీని బట్టి పదోన్నతులు కల్పిస్తారని చెబుతున్నారు. వారిని రూర్బన్ పంచాయతీలలోనే సీనియర్ అసిస్టెంట్లుగా నియమించి పాలనను మెరుగుపరచాలని నిర్ణయించారు.

మునిసిపాలిటీ తరహాలో విభాగాలు

పంచాయతీరాజ్ ప్రక్షాళనలో భాగంగా మునిసిపాలిటీ తరహాలో పలు విభాగాలను పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీల్లోను పలు విభాగాల ద్వారా విస్తృత సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. పారిశుద్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళికా విభాగం, వీధిలైట్లు విభాగం, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలుగా విభజించనున్నారు. ఈ విభాగాల ద్వారా ప్రజలకు విస్తృత సేవలందించేందుకు అవసరమైతే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించు కోవచ్చని ప్రభుత్వం సూచిస్తోంది. వారికి పంచాయతీల సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లిస్తారని తెలుస్తోంది. అదనంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను ఇక పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్లుగా గుర్తించి వారి సేవలను వినియోగించుకుంటారు. వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో భవనాలు, లేఅవుట్స్ రూల్స్ అమలు చేస్తారని చెబుతున్నారు. ప్రత్యేకమైన ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేసి అదనంగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్లు , ఇతర అర్హత కలిగిన సిబ్బందిని ఉపయోగించి పంచాయతీల్లో డిజిటల్ విభాగాన్ని అభివృద్ధి చేస్తారు. పంచాయతీల్లో రికార్డులు డిజిటలైజ్ చేసి రియల్ టైమ్‌లో పంచాయతీల ద్వారా సర్వీసులు అందించేందుకు యంత్రాగాన్ని బలోపేతం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పంచాయతీరాజ్ ప్రక్షాళనలో భాగంగా మొదట ఉద్యోగుల పదోన్నతుల సమస్యల పరిష్కారానికి ఆ శాఖ చేసిన ప్రతిపాదనలను తొలుత ఆమోదించి రెండో విడత సంస్కరణల్లో భాగంగా పంచాయతీల రీ కేటగిరైజేషన్ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

మౌలిక వసతుల కల్పనలో విఫలం

నూజివీడు టౌన్, అక్టోబర్ 11 (ఆంధ్ర జ్యోతి): గ్రామీణప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిం చడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, సీపీఎం బృందం ఆరోపించింది. నూజివీడు మండలం మీర్జాపు రంలో బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో మురుగునీరు, వీధిలైట్లు సమస్యలతో బాధపడుతున్నామని గ్రామస్థులు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజుకు వివరించారు. సీపీఎం మండల కార్యదర్శి పాలేటి సుభాష్‌చంద్రబోస్, సీపీఎం నాయకులు ప్రసాద్, మీర్జావలి, ఏసుబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నూజివీడు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నూజివీడు మండలం మీర్జాపురం శివారు కండ్రికగొల్లగూడెంలో చోటుచేసుకుంది. నూజివీడు నుంచి హనుమాన్‌జంక్షన్ వైపు ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న గోడను ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై స్పృహతప్పి పడిపోవడంతో స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వైద్య సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. నూజివీడు రూరల్ ఎస్సై జ్యోతిబసు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియాఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నిందితులకు రిమాండ్

మండవల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం పెరికెగూడెంలో నవరాత్రుల సందర్భంగా జరిగిన దాడి సంఘటనలో నిందితులను మండవల్లి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. పెరికెగూడెంలో బేతాళ సంబరంలో దేశి గణేష్‌ను పెరికెగూడెం గ్రామానికి చెందిన పెరుమాల నరేంద్రబాబు, పిండి కర్ణబాబు దాడి చేసి గాయపరచడంతో గణేష్ తీవ్రగాయాలతో కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. దీనిపై కేసు నమోదు చేసిన మండవల్లి ఎస్సై రామచంద్రరావు నిందితులను శనివారం అరెస్ట్ చేసి కైకలూరు న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.